# తొలివార్త

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

తెలుగు దిన పత్రిక

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com








ప్రచురణ : రంగారెడ్డి  ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్  సంపుటి : 02  సంచిక : 150  సోమవారం 05 - 10 - 2026  వెల : 4/-  పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial


# కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్లాన్‌లో భారీ మార్పు

- ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే కారిడార్!
- కేబీఆర్ పార్క్ చుట్టూ మౌలిక సదుపాయాల ప్రణాళికలో మార్పు
- బహుళ ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కారిడార్
- కొత్త ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ
- ఐటీ కారిడార్ వైపు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కల్పించడమే లక్ష్యం




**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 04 :** హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలనుకున్న హెచ్-సిటీ (హైదరాబాద్ క్రియేటివ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్) ఇన్‌ఫ్రా ప్రాజెక్టులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీలక మార్పులు చేసింది. గతంలో ప్రతిపాదించిన పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించింది. పంజాగుట్ట-బంజారాహిల్స్ నుంచి జూబ్లీహిల్స్ వైపు రవాణా సౌకర్యాన్ని మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఈ సవరించిన ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కొత్త డిజైన్లు, వ్యయ అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను కమిటీ ఆదేశించింది. తాజా ప్రతిపాదన ప్రకారం, పంజాగుట్ట సమీపంలోని - మిగతా 2 లో

## మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు



- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 04 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు - మిగతా 2 లో



## ఇక ఫేక్ వస్తువులను ఈజీగా గుర్తించొచ్చు!

- పుప్పొడితో స్పెషల్ సెక్యూరిటీ కోడ్‌ను రూపొందించిన ఓయూ పరిశోధకులు
- నకిలీ వస్తువులు, నోట్లు, సర్టిఫికెట్లను గుర్తించేలా ఓయూలోని వృక్షశాస్త్ర విభాగ పరిశోధకులు ఓ సాంకేతికతను రూపొందించారు
- 4వేల విభిన్న కోడ్‌లతో పనిచేసే ఈ వ్యవస్థను 12 రకాల పూల పుప్పొడితోనే తయారు చేశారు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 04 :** నకిలీ వస్తువులు, పరికరాలు, సర్టిఫికెట్ల వ్యాప్తికి చెక్ పెట్టేలా ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్లు, పరిశోధకులు ఓ సరికొత్త సాంకేతికతను కనిపెట్టారు. పువ్వుల నుంచి సేకరించిన - మిగతా 2 లో

# ఇండియా కూటమిలోకి టీవీకే విజయ్



- చారిత్రక దినమన్న కాంగ్రెస్
- బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడిందన్న మాణికం టాగోర్
- ఎన్నికల కమిషన్ చీఫ్‌కు వ్యతిరేకంగా నిరసనలకు కూటమి నిర్ణయం
- అక్టోబర్ 13 నుంచి 15 వరకు ఆందోళనలకు పిలుపు

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 04 :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం పార్టీ ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరింది. ఈ విషయాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మాణికం టాగోర్ - మిగతా 2 లో

# సింగీతంకు కన్నీటి వీడ్కోలు

- చెన్నైలో ముగిసిన అంత్యక్రియలు
- కన్నుమూసిన సింగీతం శ్రీనివాసరావు
- చెన్నై నేసపాక్కం శ్మశానవాటికలో అంత్యక్రియలు
- అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర
- సినీ యవనికపై ముగిసిన ఓ మహోన్నత అధ్యాయం



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 04 :** భారతీయ సినీ యవనికపై తనదైన ముద్ర వేసిన విలక్షణ దర్శకుడు, లెజెండరీ ఫిలింమేకర్ సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. చెన్నైలో ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు చెన్నైలోని నేసపాక్కం శ్మశానవాటికలో - మిగతా 2 లో

# శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 04 : :** తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులతో కొండపై రద్దీ వాతావరణం నెలకొంది. ఇవాళ వైకుంఠం క్యూ - మిగతా 2 లో

## శనిగ్రహాన్ని చూసే అరుదైన అవకాశం

- భూమికి అత్యంత దగ్గరగా రానున్న శనిగ్రహం
- రాత్రంతా ఆకాశంలో ప్రకాశవంతంగా కనిపించనున్న వలయాల గ్రహం
- 'ప్రతియోగం' కారణంగా ఈ ఏడాది అత్యంత పెద్దగా, స్పష్టంగా దర్శనం
- కంటితో చూడవచ్చు, టెలిస్కోప్‌తో వలయాలు పరిశీలించవచ్చు - మిగతా 2 లో

## పెమ్మసాని పొలిటికల్ హీరో నాదెండ్ల బెస్ట్ మినిస్టర్



- సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం
- గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌పై సీఎం చంద్రబాబు ప్రశంసలు
- పెమ్మసానిని పొలిటికల్ హీరోగా అభివర్ణించిన ముఖ్యమంత్రి
- ప్రజలతో మమేకమై అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడిన చంద్రబాబు
- ధరల నియంత్రణలో మంత్రి నాదెండ్ల మనోహర్ సమర్థంగా పనిచేస్తున్నారన్న సీఎం
- పేదల కోసం పనిచేసే మంత్రులుగా ఇరువురిపై కితాబు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 04 :** గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ లపై ప్రశంసల వర్షం కురిపించారు. వారి పనితీరును కొనియాడుతూ, కూటమి ప్రభుత్వంలో వారి పాత్రను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఒకప్పుడు - మిగతా 2 లో



## వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి

- బుర్రిపాలెంలో 3 లక్షల పీఎంఏవై ఇళ్లకు భూమి పూజ
- వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి ప్రధానితో ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడి
- అమరావతిని క్వాంటం వ్యాలీగా, మెగా సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 04 :** చంద్రబాబు 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఆయన అభివర్ణించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా - మిగతా 2 లో

# ఆంధ్రప్రదేశ్‌లో 3 లక్షల 3డీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

- శివరాజ్ సింగ్, చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన
- ఏపీలో 3 లక్షల పీఎంఏవై ఇళ్ల నిర్మాణం
- 2029లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేస్తామన్న సీఎం చంద్రబాబు
- గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో సీఎం చంద్రబాబు పర్యటన
- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
- పైలట్ ప్రాజెక్టుగా బుర్రిపాలెంలో 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో నిర్మాణాలు




**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 04 :** పేదలకు ఇల్లంటే నాలుగు గోడలు కాదని భద్రత, భవిష్యత్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి కుటుంబానికి భరోసా, ప్రతి వర్గానికి అండ, ప్రతి ప్రాంతానికి అవకాశం ఇదే కూటమి ప్రభుత్వ సిద్ధాంతమన్నారు. ప్రతి పేదవాడికి ఇంటి కల సాకారం చేయాలన్నదే సంకల్పమన్న సీఎం, 2029 లోపు వందశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని హామి ఇచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలెట్ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2029లోపు వందశాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. 12 ఏళ్లలో నాలుగు కోట్లకుపైగా పక్కా ఇళ్లు నిర్మించిన ఏకైక ప్రభుత్వం ఎన్డీయే అని పేర్కొన్నారు. "ప్రతి కుటుంబానికి భరోసా కూటమి ప్రభుత్వం. సంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీలో ఇళ్ల నిర్మాణం చేస్తున్నాం. మూడు నెలల్లోనే నిర్మాణం పూర్తవుతుంది. ఇలా 117 ఇళ్ల నిర్మాణాన్ని ప్రయోగాత్మకంగా చేపడుతున్నాం. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని భ్రష్టు పట్టించింది. ఎక్కడో కొండల్లో గుట్టల్లో మంజూరు చేసింది. నివాసయోగ్యం కాని ఇళ్లను మంజూరు చేస్తే ఎవరికైనా లాభం ఉంటుందా కరవు సీమను సిరుల సీమగా మారుస్తామని హామీ ఇచ్చాం. పేదలకు - మిగతా 2 లో

తొలివార్త

సోమవారం 05 - 10 - 2026

# సంపాదకీయం

## కాలుష్యకాలంలో ఢిల్లీ!



ఢిల్లీలో ఈ సమయంలో సర్వసాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయంటే, అదేమీ సంతోషించాల్సింది కాదు. 2008 తరువాత సెప్టెంబర్ నెలాఖరులో అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డు కావడమన్నది నగరం చల్లబడిందని కాక, దేశ రాజధాని మళ్ళీ కష్టకాలంలోకి జారుకుంటోందన్న హెచ్చరిక. వాయు కాలుష్యంతో ఈ శీతాకాలంలో నగరవాసులు మరోమారు నరకం అనుభవించబోతున్నారని అర్థం.ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు కూడా పెంచారు. ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వరకూ ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, కూల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటికే అమలులో ఉన్న 'నో ఫ్యూయల్--నో పీయూసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకుపడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీదే ఆధారపడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గుకట్టెలూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడికే వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం.కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించాలంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనుకూలం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్ని రకాల టపాసుల తయారీకి కూడా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలుబడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించినప్పటికీ, ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్యభయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు.

## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**మొదటిపేజీ తరువాయి -** కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి వచ్చి సుమారు కిలోమీటరు దూరంలోని శిలాతోరణం వరకు చేరాయి. ప్రస్తుతం స్వామివారి సర్వదర్శనానికి (టైమ్ టోకెన్లు లేనివారికి) సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు.అక్టోబర్ 3 ఒక్కరోజే 91,296 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 32,805 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.06 కోట్లుగా నమోదైంది. టీటీడీ అధికారులు 4.67 లక్షల లడ్డూలను విక్రయించారు. అలాగే, సుమారు 3.19 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు.రద్దీ కారణంగా భక్తుల సౌకర్యార్థం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లలో ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. వైద్య సేవలు అవసరమైన వారి కోసం అశ్విని ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం నాడు 4,516 మందికి వైద్య సేవలు అందించినట్టు అధికారులు తెలిపారు. భక్తులు సంయమనం పాటిస్తూ టీటీడీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సింగీతంకు కన్నీటి వీడ్కోలు

**మొదటిపేజీ తరువాయి -** కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ ప్రముఖుల అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. భారతీయ సినిమాకు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన ఓ మహోన్నత అధ్యాయం ఆయన మరణంతో ముగిసినట్లయింది.వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగీతం శ్రీనివాసరావు (94), చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నై విరుగంబాక్కంలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు.సింగీతంతో ఎన్నో చారిత్రక చిత్రాల్లో పనిచేసిన విశ్వనటుడు కమల్ హాసన్, ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సింగీతం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.సింగీతం మరణం పట్ల భారతీయ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు వంటి ఎందరో అగ్ర తారలు, సాంకేతిక నిపుణులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. భారతీయ సినిమాలో ప్రయోగాలకు, నూతన ఒరవడులకు సింగీతం శ్రీకారం చుట్టారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని కొనియాడారు.

## మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

**మొదటిపేజీ తరువాయి -** కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు.ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు."నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జులు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

# వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి




**మొదటిపేజీ తరువాయి -** మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి భారీగా గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లను మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో ఇంకో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, మొత్తం 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి అందించనున్నారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో నదుల అనుసంధానం వంటి గొప్ప పనులతో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించిందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా, దేశంలోనే తొలిసారిగా పేదల గృహ నిర్మాణంలో "3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ"ని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 170 ఇళ్లను ఈ నూతన సాంకేతికతతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీతో నిర్మించిన ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, తద్వారా ఏసీ అవసరం లేకుండానే చల్లదనం లభిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పినట్లు వివరించారు.కేవలం మూడు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తికావడం, వర్షాలకు తేమ చేరకపోవడం, లీకేజీలు ఉండకపోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా మరో 5,000 ఇళ్లు ఇదే విధానంలో నిర్మించి, బుర్రిపాలెం ఆదర్శాన్ని జాతీయ విధానంగా మార్చేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని చంద్రబాబు ఆరోపించారు. పేదల కోసం గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన 17 లక్షల ఇళ్లలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. చెరువులు, కొండలు, గుట్టల్లో నివాసయోగ్యం కాని స్థలాలను కేటాయించడంతో 4 లక్షల మంది లబ్ధిదారులు వాటిని తిరస్కరించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫొటోను తొలగించి రాజముద్రతో కొత్త పట్టాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీసర్వే పూర్తి చేసి, భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రాత్రింబవళ్లు పనిచేస్తామని చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకున్నామని, ఈ ఏడాది కూడా 60 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని వివరించారు. అమరావతి కేవలం రాజధాని కాదని, అదొక మెగా సిటీగా రూపుదిద్దు కుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు కలిసిపోయి అంతర్జాతీయ స్థాయి నగరం ఆవిర్భవిస్తుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న అమరావతిలో "క్వాంటం వ్యాలీ"కి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో 3 లక్షల 3డీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

**మొదటిపేజీ తరువాయి -** తాము ఇచ్చిన 6 లక్షల ఇళ్లను గత ప్రభుత్వం రద్దు చేశారన్న చంద్రబాబు, మళ్లీ వాటిని లబ్ధిదారులకు అందిస్తామని భరోసా ఇచ్చారు. రిలయన్స్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి" అని చంద్రబాబు తెలిపారు." ఏపీకి 75 వేల ఇళ్లు మంజూరయ్యాయి. నేను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపారు. 3 లక్షలు చాలవు 9 లక్షల ఇళ్లు కావాలని కోరాను. ప్రతి పేదవాడికి ఇంటి కల సాకారం చేయాలని సంకల్పించా. నా సంకల్పానికి తోడుగా శివరాజ్‌సింగ్ చేయి కలిపారు. 9 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తాం ప్రతి పేదవాడి బాగుపడాలి. సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం. కరవు సీమను సిరుల సీమగా తయారుచేస్తామని హామీ ఇచ్చాం. రిలయన్స్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి. దూరదృష్టితో ఆలోచించి పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకొచ్చా. పట్టిసీమతో కృష్ణా డెల్టాను కాపాడింది కూటమి ప్రభుత్వమే. అభివృద్ధి చేస్తుంటే కొంతమంది అడ్డంపడ్డారు, ఎక్కడా తగ్గలేదు. వచ్చే మార్చికి పోలవరం పూర్తిచేసి ప్రధాని చేతులమీదుగా జాతికి అంకితం చేస్తాం. విజయవాడ, తెనాలి, మంగళగిరి, గుంటూరు మెగా సిటీగా తయారవుతుంది." బుర్రిపాలెం అంటే సూపర్‌స్టార్ కృష్ణ గుర్తొస్తారు. ఇప్పుడు అక్కడ ఇంకో హీరో వచ్చారు. ఆయనే పెమ్మసాని. కృష్ణ సినీ హీరో అయితే పెమ్మసాని పొలిటికల్ హీరో. అభివృద్ధి చేయడంలో పెమ్మసాని ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. నాకు కేబినెట్‌లో మొదట గుర్తొచ్చేది నాదెండ్ల మనోహర్. ధరలు పెరగకుండా ఆయన సమర్థంగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కోసం త్యాగం చేసిన సీనియర్ నేత రాజేంద్రప్రసాద్. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అనునిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు" అని చంద్రబాబు తెలిపారు.

## పెమ్మసాని పొలిటికల్ హీరో, నాదెండ్ల బెస్ట్ మినిస్టర్

**మొదటిపేజీ తరువాయి -** బుర్రిపాలెం అనగానే సూపర్ స్టార్ కృష్ణ గారు గుర్తొచ్చేవారు. ఇప్పుడు ఇక్కడికి మరో హీరో వచ్చారు. ఆయన సినిమా హీరో అయితే, మన పెమ్మసాని చంద్రశేఖర్ పొలిటికల్ హీరో" అని అభివర్ణించారు. పెమ్మసానిని ఎంపీగా ఎంపిక చేసినప్పుడు తనకు కొన్ని సందేహాలు కలిగాయని చంద్రబాబు బహిరంగంగా అంగీకరించారు. "ఎక్కువకాలం అమెరికాలో ఉన్న పెమ్మసాని, ఇక్కడి ప్రజలతో పట్టు సాధించగలరా వారితో మమేకం అవుతారా అని నేను మొదట అనుమానించాను. కానీ ఈరోజు ఆయన ప్రసంగాలు, ప్రజలతో కలిసిపోతున్న తీరు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఒక సామాన్యుడిలా ప్రజల్లో ఒకరిగా మారిపోయి, అందరి బాగోగులు చూసుకుంటూ బ్రహ్మాండంగా ముందుకు దూసుకెళుతున్నారు" అని చంద్రబాబు కొనియాడారు. పెమ్మసాని ఆధ్వర్యంలో బుర్రిపాలెంలో చేపడుతున్న 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది దేశానికే ఆదర్శం కానుందని పేర్కొన్నారు.అదేవిధంగా, జనసేన నాయకుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పనితీరును చంద్రబాబు ఎంతగానో మెచ్చుకున్నారు. "నాకు కేబినెట్‌లో మొదట గుర్తొచ్చేది నాదెండ్ల మనోహర్. నిత్యావసరాల ధరలు కొంచెం పెరిగినా, వెంటనే నాకు ఒక చీటీ పంపించి పరిస్థితిని వివరిస్తారు. ధరలను నియంత్రణలో ఉంచడానికి మేము ఈ చర్యలు తీసుకుంటున్నామని చెబుతారు. పేద ప్రజలపై ధరల భారం పడకుండా అనునిత్యం పనిచేస్తున్న అత్యంత సమర్థవంతమైన మంత్రి మనోహర్" అని ప్రశంసించారు. ఆయన నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరగడంపై సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో కీలకమైన శాఖలను నిర్వహిస్తున్న ఈ ఇద్దరు నేతలు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందున్నారని చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు. వారి పనితీరు కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని ఆయన అన్నారు.

## ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే

**మొదటిపేజీ తరువాయి -** అధికారికంగా ప్రకటించారు.చెన్నైలోని టీఎన్‌సీసీ కార్యాలయంలో జరిగిన బహుళ పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి టీవీకే తరపున మంత్రులు ఆధవ్ అర్జున, ఎన్.మేరీ విల్సన్ హాజరయ్యారు. టీవీకే చేరికను 'చారిత్రక దినం'గా అభివర్ణించిన మాణికం టాగోర్, ఈ పరిణామంతో తమిళనాడులో బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్, టీవీకేతో పాటు సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల కమిషన్ చీఫ్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి ప్రదర్శనలు, అక్టోబర్ 15న చెన్నైలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు.ఇండియా కూటమిలో తమ పార్టీ అధికారికంగా చేరినట్లు టీవీకే మంత్రి ఆధవ్ అర్జున సైతం ధ్రువీకరించారు. అయితే, దీనిపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి విజయ్ నుంచి నేరుగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## శనిగ్రహాన్ని చూసే అరుదైన అవకాశం

**మొదటిపేజీ తరువాయి -** ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. సౌర కుటుంబంలో తన చుట్టూ ఉన్న వలయాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే శనిగ్రహం, ఆదివారం (అక్టోబర్ 4) భూమికి అత్యంత సమీపంలోకి రానుంది. దీంతో ఆ రోజు రాత్రంతా ప్రకాశవంతంగా మెరుస్తూ ఖగోళ ప్రియులకు కనువిందు చేయనుంది. ప్రతి ఏడాది ఒకసారి జరిగే ఈ అరుదైన సన్నివేశాన్ని 'ప్రతియోగం' అని పిలుస్తారు. ఈ సమయంలో సూర్యుడు, భూమి, శనిగ్రహం ఒకే సరళరేఖపైకి వస్తాయి.ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఖగోళ అద్భుతం కారణంగా శనిగ్రహం భూమి నుంచి సుమారు 126.17 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆదివారం సాయంత్రం 5:59 గంటల నుంచి తూర్పు దిక్కున లేత పసుపు రంగులో ఒక ప్రకాశవంతమైన చుక్కలా శనిగ్రహం ఉదయించడం మొదలవుతుంది. దీనిని ఎలాంటి పరికరాల సాయం లేకుండానే కంటితో స్పష్టంగా గుర్తించవచ్చు. సూర్యుడు అస్తమించగానే, శని ప్రకాశం మరింత పెరుగుతుంది.అయితే, ఒక చిన్న టెలిస్కోప్ లేదా బైనాక్యులర్ సాయంతో చూస్తే, ఈ గ్రహం అసలు అందం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. శనిగ్రహం చుట్టూ ఉన్న మంచు, రాతి ముక్కలతో ఏర్పడిన అద్భుతమైన వలయాలను స్పష్టంగా చూసే అవకాశం లభిస్తుంది. 2026 సంవత్సరంలో శనిగ్రహం అత్యంత ప్రకాశవంతంగా కనిపించేది ఈ సమయంలోనే.సాధారణంగా ప్రతి 378 రోజులకు ఒకసారి భూమి, సూర్యుడికి, శనిగ్రహానికి మధ్యగా వస్తుంది. గతేడాది 2025 సెప్టెంబర్ 21న కూడా ఇలాంటి దృశ్యం ఆవిష్కృతమైంది. ఈసారి వలయాలు మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆదివారం రాత్రంతా ఆకాశంలో కనిపించే శని, అర్ధరాత్రి సమయానికి నడినెత్తిన ఉండి, తెల్లవారుజామున పడమటి దిక్కున అస్తమిస్తుంది.నగరాల్లోని కాంతి కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాలకు లేదా శివారు ప్రాంతాలకు వెళ్తే ఈ దృశ్యాన్ని మరింత స్పష్టంగా ఆస్వాదించవచ్చు. ఖగోళ ప్రియులకు, ఆకాశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఇది ఒక పండుగలాంటి అవకాశం. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఈ అద్భుతాన్ని వీక్షించవచ్చు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్లాన్‌లో భారీ మార్పు




**మొదటిపేజీ తరువాయి -** ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతం వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీని ద్వారా జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ-మాదాపూర్ ఐటీ కారిడార్ వైపు వాహనదారులు ఎలాంటి సిగ్నల్స్ లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్రాజెక్టులో ఇది ఒక ప్రధానమైన మార్పు. గతంలో పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్ల వద్ద జీహెచ్‌ఎంసీ పలు స్టీల్ ఫ్లైఓవర్లు, డైరెక్షనల్ అండర్‌పాస్‌లను నిర్మించాలని ప్లాన్ చేసింది. ప్యాకేజీ కింద అంచనా వ్యయం మొదట రూ. 826 కోట్లు కాగా, తర్వాత అది రూ. 1,090 కోట్లకు పెరిగింది. అయితే, ఈ ఏడాది ఆగస్టులో కేబీఆర్ పార్క్ చుట్టూ క్లాక్‌వైజ్ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. నిర్మాణ పనుల కోసం తాత్కాలికంగా మొదలుపెట్టిన ఈ విధానం వల్ల ట్రాఫిక్ కదలికలు మెరుగుపడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో, తొలుత ప్రతిపాదించిన అన్ని గ్రేడ్ సెపరేటర్లు అవసరమా అనే దానిపై పునరాలోచనలో పడ్డారు.దీనికి తోడు, పాత ప్రాజెక్టుకు పర్యావరణ, న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురయ్యాయి. కేబీఆర్ పార్క్ ఎకో-సెన్సిటివ్ జోన్ పరిధిలో చెట్ల నరికివేత, తరలింపుపై స్టే రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ తన ప్రణాళికను సవరించింది.ప్రస్తుతానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపినప్పటికీ, ఇది తుది నిర్మాణ ప్రణాళిక కాదు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి ఇంజనీరింగ్ డిజైన్లు, సవరించిన వ్యయ అంచనాలు ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. అనంతరం ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపి, ఈపీసీ కమిటీ, జీహెచ్‌ఎంసీ జనరల్ బాడీ ముందు ఉంచుతారు. ఈ మార్పులతో హైదరాబాద్‌లోని అతిపెద్ద రోడ్డు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులలో ఒకటైన హెచ్-సిటి స్వరూపం గణనీయంగా మారనుంది.

# ఇక ఫేక్ వస్తువులను ఈజీగా గుర్తించొచ్చు!

**మొదటిపేజీ తరువాయి -** పుప్పొడి రేణువులతో క్వాంటం డాట్స్‌ను అనుసంధానించడం ద్వారా అసలైన వస్తువులు, పత్రాలకు ప్రత్యేకమైన కోడ్‌లను కేటాయించనున్నారు. దీని ద్వారా నకిలీలను సులభంగా గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పరిశోధనను వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి, రసాయన శాస్త్ర విభాగం బి.విజయకుమార్‌తో పాటు విద్యార్థిని డి.నిర్మల పూర్తిచేశారు.కరెన్సీ, ధ్రువపత్రాలు, రూ.లక్షలు ఖరీదైన ఆభరణాలు, వాచీల వంటి విలువైన వస్తువులకు ఈ ప్రక్రియ పటిష్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తుందని ప్రొఫెసర్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. పరిశోధకులు కొన్ని రకాల పూలను ఎండబెట్టి వాటి నుంచి పుప్పొడి రేణువులను సేకరించి వాటి ఆకారాల ఆధారంగా నిర్దిష్ట నమూనాల అమరికలను చేశారు. ఇందుకు గానూ 12 రకాల పుష్పాలను తీసుకున్నారు. రక్త చందనం, గడ్డిచేమంతి (అడవి చామంతి), బూరుగు (పట్టు పత్తి), గరిక, తుమ్మ సహా పన్నెండు రకాల పుష్పాలను ఉపయోగించారు.పరిశోధనకు కావాల్సిన పూలను రీసెర్చ్ టీం ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణం నుంచే సేకరించింది. ఆ పుష్పాల రేణువులను ఎండబెట్టి, క్వాంటం డాట్స్‌తో అనుసంధానం చేయగా, ఆ పదార్థం బంగారు గోధుమ రంగులోకి మారుతుంది. అనంతరం సాంకేతికతను ఉపయోగించి వాటిని కాంతి కిరణాలుగా మార్చడం వల్ల 4 వేల విభిన్న కోడ్‌లు వచ్చాయి. వాటిని పరిశోధకులు కొన్ని రకాల వస్తువులు, సర్టిఫికెట్లు, పరికరాలపై ప్రయోగించి చూడగా, అవి ఓ సెక్యూరిటీ కోడ్‌గా పనిచేస్తున్నాయి.విలువైన వస్తువులు ముఖ్యంగా రూ.లక్షల ఖరీదైన ఆభరణాలు లేదా సర్టిఫికెట్ల లాంటి వాటిలో సెక్యూరిటీ కోడ్‌ను అమర్చితే చాలు. మోసపూరిత లేదా నకిలీదని సందేహం వస్తే, నిర్ధారించుకోవడానికి వాటిలోని మైక్రో సిలిండర్‌ను చెక్ చేస్తే తెలిసిపోతుంది. అందులో ఉండే కోడ్‌ను ఓ ప్రత్యేక ఆప్టికల్ స్కానర్ లేదా మైక్రోస్కోప్ సాయంతో స్కాన్ చేయాలి. అది ల్యాబ్‌లో రికార్డు చేసిన 4వేల



కోడ్‌ల డేటాబేస్‌తో మ్యాచ్ అయితే అది అసలైన వస్తువు. లేదంటే నకిలీదని నిమిషాల్లోనే తెలిపోతుంది.వృక్షశాస్త్రం, నానోటెక్నాలజీ, ఆప్టికల్ సైన్స్ రంగాలను మిళితం చేస్తూ రూపొందించిన ఈ వినూత్న ఆవిష్కరణ, దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ నకిలీ ఉత్పత్తుల నియంత్రణలో విప్లవాత్మక మార్పులను తీసుకురానుందని పరిశోధకులు భావిస్తున్నారు.

తొలివార్త
సోమవారం 05 - 10 - 2026

# హయత్ నగర్ లేబర్(కార్మికుల)అడ్డాను పరిశీలించిన శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



హయత్ నగర్ **అక్టోబర్ 04 ( తొలివార్త ):** చుట్టుపక్కల కాలనీవాసులు మరియు అక్కడ ఉన్న లేబర్ వారితో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా చుట్టుప్రక్కల కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రతినిత్యం ఇట్టి లేబర్ అడ్డా వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము అని అన్నారు.ఇక్కడే రోడ్డు మీద మూత్రవిసర్జన,పేకాట,రోడ్డు ప్రక్కన పడుకోవడం జరుగుతుంది అని దీని వల్ల అట్టి కాలనీలోకి వెళ్ళడానికి మహిళలు తదితరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము అని అన్నారు.కావున ఇట్టి అడ్డాను మరొక్కచోటుకు తరలించాలని కోరారు.అనంతరం సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఇక్కడ ఎన్నో సంవత్సరాలనుండి వీరు బ్రతుకులు వెల్లధీసుకుంటున్న నేపథ్యంలో వీరికి ప్రక్కన ఉన్న రేడియో స్టేషన్ దగ్గర ఉన్న ఫుట్ పాత్ దగ్గర అట్టి కార్మికులకు మూత్రశాలలు,మంచినీటి సౌకర్యం,సేద తిరడానికి ఒక షెడ్డు నిర్మిస్తామని సుధీర్ రెడ్డి గారు తెలిపారు.దానికి వారు అంగీకారం తెలియజేయడం జరిగింది.అలాగే స్థానిక ట్రాఫిక్ పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ లేబర్ అడ్డా వారికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.అట్టి లేబర్ అడ్డా ప్రక్కకు తరలించినందుకు గాను చుట్టుపక్కల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమంలో మన్సురాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,గుత్త లక్ష్మారెడ్డి,దీపావళి శ్రీకాంత్ మరియు చుట్టుప్రక్కల పలు కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నాహక సమావేశం



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 04 ( తొలివార్త ):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి డా.గడల శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ, భద్రాచలం నియోజకవర్గం నుంచి పటిష్టమైన కార్యాచరణ రూపొందించేందుకు సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ఎన్నికల కోఆర్డినేటర్లు బండి నరేష్,సుమన్, భద్రాచలం నియోజకవర్గం పిఓసి నాయకులు బండి రాంప్రసాద్ హాజరై పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు పట్టభద్రుల ఓటు నమోదు,ఎన్నికల నిర్వహణ,ప్రచార కార్యక్రమాలు పార్టీ క్షేత్రస్థాయి బలోపేతం తదితర ఎన్నికల కార్యాచరణ అంశాలు,రాబోయే రోజుల్లో జనసేన పార్టీ తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఈ యొక్క జరగబోవు పట్టభద్రుల ఎలక్షన్లలో ప్రతి ఒక్క పట్టభద్రులు వారి యొక్క అమూల్యమైన ఓటు హక్కుని నమోదు చేసుకోగలరని తెలియజేశారు అలాగే కార్యకర్తలను ఉద్దేశించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లో ప్రతి ఒక్క జనసేన కార్యకర్తలు నాయకులు వీర మహిళలు చురుగ్గా పాల్గొని ఈ యొక్క పట్టభద్రుల ఓటు హక్కుని నమోదు కార్యక్రమంలో పాల్గొని జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అయినటువంటి డా.గడల శ్రీనివాస్ గారి గెలుపుకై ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం బండారు శ్రీకాంత్, దేగల శివ, పొంది వంశీ, నాచుపల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి నవీన్, నక్క సురేష్, సాయి, దుర్గాప్రసాద్, ప్రశాంత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బట్ట సూరమ్మ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 04 ( తొలివార్త ):**అశ్వాపురం మండలం పాములపల్లి గ్రామంలోని బట్టీల గుంపు పంచాయతీ పరిధిలోని బట్టమల్లయ్య గుంపుకు చెందిన బట్ట సూరమ్మ గారు ఇటీవల మృతి చెందడంతో, ఆదివారం తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్ పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.బట్టీల గుంపు మాజీ సర్పంచ్ బట్ట సత్యనారాయణ భూపాల్ గార్ల మాతృమూర్తి అయిన బట్ట సూరమ్మ సెప్టెంబర్ 23వ తేదీన మృతి చెందారు. సూరమ్మ, మృతి చెందిన సమయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందుబాటులో లేకపోవడంతో, ఈరోజు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. సూరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని,ప్రార్థించారు.కుటుంబ సభ్యుల బాధను పంచుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు,ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటానని, కుటుంబానికి తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి వెంట ఎల్లప్పుడూ ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బట్టీల గుంపు సర్పంచ్ కలివేటి సరిత అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ సీనియర్ నాయకులు గాదే కేశవరావు,మాజీ సర్పంచ్ బట్ట సత్యనారాయణ,తెల్లం వీరభద్రం, గ్రామస్తులు గ్రామ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సర్పంచులను అవమానిస్తే కఠిన చర్యలు తప్పవు..

**జిల్లా సర్పంచుల ఫోరం మహిళ అధ్యక్షురాలు**

**అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల రెడ్డి హెచ్చరిక**



చౌటుప్పల్, **అక్టోబర్ 04 ( తొలివార్త ):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో,స్థానిక పరిపాలనలో మహిళా సర్పంచులు అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని,అయితే ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు,వర్గాలు మహిళా సర్పంచుల పట్ల అవమానకరంగా ప్రవర్తించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని సర్పంచుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు,చౌటుప్పల్ మండలం అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,రాజ్యాంగం అందించిన హక్కులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న మహిళా ప్రతినిధులపై ఇటువంటి చర్యలకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధం,నేరమని పేర్కొన్నారు.

**కఠిన చర్యలు తప్పవు**

మహిళా సర్పంచుల విధులకు అడ్డుకట్ట వేసినా,వారి గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడినా,వేధింపులకు గురిచేసినా సంబంధిత వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత మరియు సంబంధిత చట్టాల కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు.అలాగే మహిళా ప్రజా ప్రతినిధులపై అసత్య ప్రచారాలు,దుర్భాషలాడడం వంటి చర్యలకు పాల్పడితే సైబర్ క్రైమ్ చట్టాల కింద కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సర్పంచులందరూ సమిష్టిగా మహిళా సర్పంచులకు అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు.

# సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలి

**బునాదిగాని కాలువ, బస్వాపూర్ హై లెవల్ కెనాల్‌పై**

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి**





భువనగిరి **అక్టోబర్ 04 ( తొలివార్త ):** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సెక్రటేరియట్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనగిరి నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, కాలువల పనుల పురోగతిపై ఆయన మంత్రితో చర్చించారు. ప్రధానంగా బునాదిగాని కాలువ పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్యాకేజీ–16లో భాగంగా చేపడుతున్న బస్వాపూర్ హై లెవల్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆయా పనుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పనులు ముందుకు సాగేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం ద్వారా రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భువనగిరి నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీటి సౌకర్యం కల్పించడంలో ఈ ప్రాజెక్టులు కీలకమని, పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూసేకరణతో పాటు ఇతర సాంకేతిక, పరిపాలనా సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించిన వివిధ సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ, పెండింగ్ పనులు, నిర్మాణ దశలో ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ తదితర కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రాజెక్టుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ మట్టి బిడ్డల స్ఫూర్తితోనే జనసేన ఆవిర్భావం

**డా.గడల శ్రీనివాసరావు**

**చౌటుప్పల్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి జనసేన సమావేశం**







చౌటుప్పల్, **అక్టోబర్ 04 ( తొలివార్త ):** తెలంగాణ మట్టి బిడ్డల నుంచి పొందిన స్ఫూర్తితోనే జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఈ రాష్ట్రంలోనే ఆవిర్భవించిందని జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ,నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లోని జయశ్రీ గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీళ్లు,నిధులు,నియామకాల కోసం1200 మంది తెలంగాణ యువత బలిదానంతో ఏర్పడిన తెలంగాణలో పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఇచ్చిన హామీలు అమలు చేయక ఫామ్ హౌస్ కే పరిమితమైందన్నారు.ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగ నియామ్మకాలు,నిరుద్యోగ భృతి,విద్యార్థులకు స్కూటీలు,జాబ్ క్యాలెండర్,మహిళలకు నెలకు రూ.2500,లక్ష రూపాయల కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం,అంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లయినా 20 శాతం హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు.రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని,కామారెడ్డి డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు.ప్రజలను గొర్రెలు అనుకుంటున్నారా అని నిలదీశారు.బీఆర్ఎస్ పదేళ్ల అరణ్యవాసం,కాంగ్రెస్ మూడేళ్ల అజ్ఞాతవాసం పూర్తయ్యాయని,అందుకే జనసేన రంగంలోకి దిగి గళమెత్తి ప్రశ్నిస్తుందన్నారు.జనసేన అధికారంలోకి వస్తేనే తెలంగాణలో సామాజిక న్యాయం జరుగుతుందన్నారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జనసేనకు సెమీ ఫైనల్స్ లాంటివని,ఉద్యమాల పురిటిగడ్డ నల్లగొండ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల యుద్ధాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు.పవన్ కళ్యాణ్ వస్తున్నారు.ఆయన వస్తే ప్రళయం వస్తుందని అన్నారు.

**రూ.లక్ష విరాళం అందజేసిన ఆముదాల పరమేశ్:**

జనసేన పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిమిత్తం రూ.లక్ష విరాళం చెక్కును అభ్యర్థి గడల శ్రీనివాసరావు కు సభా వేదికపై అందజేశారు.ఒక ఆశయం,లక్ష్యం,సిద్ధాంతం కోసం పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ కు పట్టభద్రులు అండగా నిలవాలని కోరారు.ఈ సమావేశంలో అత్యధిక సభ్యత్వాలు చేర్పించిన వివిధ నియోజకవర్గాల నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన తెలంగాణ జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్ము రెడ్డి ప్రేమ్ కుమార్,రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్,శర్మ, శిరీష,ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ,శివ కార్తీక్,లక్ష్మణ్ గౌడ్,పీక ప్రవీణ్, మామిడాల రమేశ్,శ్రీకాంత్, లింగస్వామి,బద్రి రాజు,పాండు, ప్రవీణ్,తదితర జనసైనికులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు..

**ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు**

**సుర్కంటి శ్రీధర్ రెడ్డి**



భువనగిరి, **అక్టోబర్ 04 ( తొలివార్త ):** ఉప సర్పంచుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని,అధికారాలు,విధులపై స్పష్టత ఇవ్వాలని ఉప సర్పంచుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సుర్కంటి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని జిల్లా ఉప సర్పంచుల ఫోరం నిర్ణయించింది.భువనగిరి పట్టణంలో జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు,చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామఉప సర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప సర్పంచుల అధికారాలు,విధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని,గౌరవ వేతనం పెంచాలని,గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఉప సర్పంచులకు సముచిత భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.పంచాయతీ సమావేశాల్లో ఉప సర్పంచులకు తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు,వారి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు.ఉప సర్పంచుల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.జిల్లాలో ఏ గ్రామంలోనైనా ఉప సర్పంచులపై సర్పంచులు దాడులకు పాల్పడినా,వారి గౌరవాన్ని కించపరిచినా తీవ్రంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు.హక్కులు,గౌరవం కోసం జిల్లాలోని ఉప సర్పంచులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లాలోని పలు గ్రామాల ఉప సర్పంచులను జిల్లా కమిటీలోకి తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు జిల్లా కమిటీకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు చిన్నం బాలరాజు,జిల్లా కమిటీ సభ్యులు చిలకల సంతోష్,వెల్దండ కృష్ణారెడ్డి,వడ్డబోయిన వెంకటేష్,లింగారెడ్డి,ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బొమ్మకంటి కిషోర్,వెంకటేష్ నాయక్,పార్వతీపురం ఉప సర్పంచ్ నరేందర్,వర్కట్ పల్లి ఉప సర్పంచ్ నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తో ఆర్టీసీ కూటమి సంఘాల నాయకులు కీలక భేటీ




మణుగూరు, **అక్టోబర్ 04 ( తొలివార్త ):**ఈ నెల 9వ తేదీన జరగనున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన, ఎస్ డబ్ల్యూ ఎఫ్, టి యమ్ యు సి ఐ ఎన్ టి యు సి, సంఘాల ప్రతినిధులు మూడు సంఘాల కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఆదివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు,తో, ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సంక్షేమం, యూనియన్ ఎన్నికలు తదితర అంశాలపై చర్చించారు.మూడు సంఘాల సమన్వయంతో ఏర్పడిన కూటమి తరఫున ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కార్యాచరణ, ప్రచారం, సమన్వయం తదితర అంశాలపై నాయకులు చర్చించారు. మణుగూరు ఆర్టీసీ డిపో పరిధిలో 241 మంది ఓటర్లు ఉన్నట్లు నాయకులు తెలిపారు కూటమి ఎన్నికల సమన్వయానికి సంబంధించి పిఎస్ రెడ్డి,ఆర్ఎం రెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలు, సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై యూనియన్ ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న యూనియన్ ప్రతినిధులు: పి ఎస్ రెడ్డి, ఆర్ఎం రెడ్డి ఐ ఎన్ టి యు సి,చారీ ఐఎన్టియుసి, డిపో సెక్రటరీ బి. రాములు నాయక్ -- తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ డి ఈ పి ఓ, సెక్రటరీ, ఎస్ డబ్ల్యూ ఎఫ్, -సిఐటియు, తాటి సుధాకర్ డి ఈ పి ఓ, సెక్రెటరీ, టి డబ్ల్యూ, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్, కూటమి నాయకులు, ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# రాచకొండ దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ






సంస్థాన్ నారాయణపురం **అక్టోబర్ 04 ( తొలివార్త ):** రాచకొండ దసరా ఉత్సవాల సమితి,ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాచకొండ దసరా ఉత్సవాల కరపత్రాన్ని ఆదివారం రాచకొండలోని రామాలయం వద్ద ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ ఇరుగుదిండ్ల భాస్కర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు మునుగోడు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో సినీ ,జానపద కళాకారులచే ఆటపాటలు, బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిదంగా అక్టోబర్ 22న ఘట్టుప్పల్ మండలంలో దసరా సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ సంబరాలలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహించబో తున్నామని అన్నారు.రాచకొండను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడమే తన అంతిమ లక్ష్యమని, హైదరాబాద్ కు కూతవేటు దూరంలో ఉన్న రాచకొండను అభివృద్ధి చేయడం ద్వారా సమీప గ్రామాలు అభివృద్ధి చెంది,స్థానిక ప్రజలకు ఉపాధి లభిస్తుందని అన్నారు.రాచకొండలోని ప్రాచీన దేవాలయాల పునర్నిర్మాణానికి తన కృషి ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణ కుమార్,అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి,వివిధ గ్రామాల ప్రజలు,ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని దాచొద్దు

**ఆర్టీఐ చట్టం వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి**

**సెక్షన్ 4(1)(బి) ప్రకారం 17 అంశాల సమాచారాన్ని**

**ప్రజలకు అందుబాటులో ఉంచాలి**

**యునైటెడ్ ఫోరం ఫర్ రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ క్యాంపెయిన్ జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్**



**భువనగిరి, అక్టోబర్ 04 ( తొలివార్త ):** ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు అవినీతి రహిత సమాజ నిర్మాణానికి సమాచార హక్కు చట్టం--2005ను పకడ్బందీగా అమలు చేయాలని యునైటెడ్ ఫోరం ఫర్ రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ క్యాంపెయిన్ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) నిబంధనలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రజా ప్రాధికార సంస్థలు కూడా సమాచార హక్కు చట్టం నిర్దేశించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు ప్రత్యేకంగా దరఖాస్తులు చేసుకుని సమాచారం కోరే పరిస్థితి తగ్గేలా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కీలక సమాచారాన్ని ముందుగానే ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.

### 17 అంశాల సమాచారాన్ని బహిరంగపరచాలి

సమాచార హక్కు చట్టం--2005లోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల విధులు, అధికారుల బాధ్యతలు, నిర్ణయాలు తీసుకునే విధానం, అమలులో ఉన్న నిబంధనలు, కార్యాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, ఉద్యోగుల వివరాలు, వారి వేతనాలు, బడ్జెట్ కేటాయింపులు, ప్రభుత్వ వ్యయాలు, సబ్సిడీలు, వివిధ పథకాల లబ్ధిదారులు, రాయితీలు, అనుమతులు తదితర 17 రకాల సమాచారాన్ని ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని ఆయన తెలిపారు. ఈ సమాచారాన్ని కార్యాలయాల నోటీసు బోర్డులతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లలో కూడా స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని దాచిపెట్టడం లేదా అందుబాటులో లేకుండా చేయడం వల్ల ప్రభుత్వ వ్యవస్థపై అనుమానాలు ఏర్పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### పీఐఓల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలి

సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు సమాచారాన్ని అందించే ప్రజా సమాచార అధికారులు (పి ఐ ఓ), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏ పి ఐ ఓ), మొదటి అప్పీల్ అధికారుల (ఫ్ ఏఏ) పేర్లు, హోదాలు, కార్యాలయ చిరునామాలు, సంప్రదింపు వివరాలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని కొడారి వెంకటేష్ సూచించారు. అధికారుల బదిలీలు, పదోన్నతులు లేదా బాధ్యతల మార్పులు జరిగిన సందర్భంలో పీఐఓ, ఏపీఐఓ, ఎఫ్ఏఏ వివరాలను వెంటనే సవరించాలని కోరారు. పాత అధికారుల పేర్లు, వివరాలు కొనసాగించడం వల్ల సమాచార హక్కు దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

### ఆర్టీఐ వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ వారోత్సవాలను ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని కొడారి వెంకటేష్ కోరారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలకు ఆర్టీఐ చట్టంలోని హక్కులు, దరఖాస్తు విధానం, అప్పీల్ ప్రక్రియ, ప్రభుత్వ కార్యాలయాల బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందాల్సిన సమాచారాన్ని ప్రజలు పదేపదే దరఖాస్తులు చేసుకునేలా కాకుండా ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా ముందుగానే బహిరంగపరచాలని అన్నారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కీలక సమాచారాన్ని పారదర్శకంగా ప్రజల ముందుంచడం ద్వారా పాలనలో పారదర్శకత పెరగడంతో పాటు అధికారులపై జవాబుదారీతనం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కు అని, దానిని సమర్థవంతంగా అమలు చేయడం ప్రభుత్వ శాఖల బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. చట్టం నిర్దేశించిన సమాచారాన్ని దాచకుండా, ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా బహిరంగంగా ప్రదర్శించాలని కొడారి వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు.

# ఆట్యా-పాట్యా జిల్లా అధ్యక్షుడిగా దరిపల్లి ప్రవీణ్ కుమార్

**గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికితీస్తాం**

**పాఠశాలలు, కళాశాలల్లో ఆట్యా-పాట్యాపై అవగాహనకు ప్రాధాన్యం**






**భువనగిరి, అక్టోబర్ 04 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆట్యా-పాట్యా క్రీడా అసోసియేషన్ అడ్హాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా దరిపల్లి ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు జిల్లా ఆట్యా-పాట్యా క్రీడా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆట్యా-పాట్యా అసోసియేషన్ సెక్రటరీ ముకేశ్ సూచనల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లాలో ఆట్యా-పాట్యా క్రీడ అభివృద్ధి, క్రీడాకారులకు అందించాల్సిన ప్రోత్సాహం, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను గుర్తించడం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ప్రతినిధుల ఏకగ్రీవ ఆమోదంతో యాదాద్రి భువనగిరి జిల్లా అడ్హాక్ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అడ్హాక్ కమిటీ అధ్యక్షులు: దరిపల్లి ప్రవీణ్ కుమార్ ఉపాధ్యక్షులు: సూరారం వెంకన్న సెక్రటరీ: దుబ్బల మల్లారెడ్డి జాయింట్ సెక్రటరీ: ఇంజమూరి అశోక్ ట్రెజరర్: జిట్టా మధు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు: కల్లూరి ప్రవీణ్ కుమార్, దారావత్ నవీన్, దారావత్ ప్రవీణ్. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆట్యా-పాట్యా క్రీడను మరింత విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం, శిక్షణ, పోటీ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అలాగే జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఆట్యా-పాట్యా క్రీడపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ఈ క్రీడలో ఎక్కువ మంది యువత పాల్గొనేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఆట్యా-పాట్యా క్రీడకు బలమైన పునాది ఏర్పాటు చేసి, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి వారికి మెరుగైన అవకాశాలు కల్పించడమే నూతన కమిటీ ప్రధాన లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు. అందరి సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లాను ఆట్యా-పాట్యా క్రీడలో ముందంజలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# కంచనపల్లిలో నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**కమిటీ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి రూ.8.54 లక్షల విరాళాల ప్రకటన**



**వలిగొండ, అక్టోబర్ 04 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కంచనపల్లి గ్రామంలో గ్రామ ప్రజలు, యువకుల ఆధ్వర్యంలో నూతన గ్రామ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గ్రామ పెద్దలు, యువకులు కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్ రేసు బుచ్చి రెడ్డి, కొమిరెల్లి బాలకృష్ణారెడ్డి, అధ్యక్షులుగా జక్క సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పెద్దిటి మధుసూదన్ రెడ్డి, పల్లపు నాగరాజు, ఎంపాల జాన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జక్క జంగారెడ్డి, సహాయ కార్యదర్శిగా వడ్లకొండ నర్సింహ, కోశాధికారిగా గంగారం రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జక్క సుధాకర్ రెడ్డి గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారంగా స్వచ్ఛందంగా రూ.5 లక్షలు విరాళంగా ప్రకటించారు. అలాగే కమిటీ సభ్యులు కూడా గ్రామాభివృద్ధికి ఆర్థిక సహకారం ప్రకటించారు. కొమిరెల్లి బాలకృష్ణారెడ్డి రూ.1,00,116, గంగారం రమేష్ రూ.1,00,116, జక్క జంగారెడ్డి రూ.51,116, పల్లపు నాగరాజు రూ.51,116, పెద్దిటి మధుసూదన్ రెడ్డి రూ.51,117 విరాళాలను ప్రకటించారు. కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు కలిసి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, యువతకు సంబంధించిన కార్యక్రమాలతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. గ్రామ ప్రజల సహకారంతో కంచనపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నూతన కమిటీ పనిచేస్తుందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్క శంకర్ రెడ్డి, దేగల పాండరి, మోర వెంకట్ రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, జక్క నర్సింహారెడ్డి, మహేందర్ రెడ్డి, పైళ్ల వెంకట్ రెడ్డి, పరశురాం, రాజిరెడ్డి, వెంకటేశం, నరేష్, యాదయ్య, సత్తయ్య, లిగస్వామి, మల్లేశం, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరు లో యథేచ్ఛగా అక్రమ వెంచర్లు..!

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి**

**పట్టించుకోని మున్సిపల్ అధికారులు**



**నందికొట్కూరు, అక్టోబర్ 04 ( తొలివార్త ):** నందికొట్కూరు లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇష్టారాజ్యంగా అక్రమ లే అవుట్లు వేస్తున్న మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పక్కన పెట్టి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చాలంటే మార్కెట్ విలువకు తగ్గట్టుగా ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. ఆ రసీదుతో తహసీల్దారుకు దరఖాస్తు చేసుకుంటే ఆర్డీవో నుంచి అనుమతులు వస్తాయి. ఇవేవీ చేయకుండానే వ్యవసాయ భూములను లేఅవుట్లుగా మార్చి క్రయవిక్రయాలు చేస్తున్నారు.

### మున్సిపల్ నిబంధనలకు తూట్లు :

లేఅవుట్లు వేస్తున్న వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి చెల్లించుండా ప్లాట్లను విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులను సైతం లెక్క చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు ఆ భూమిని లే అవుట్ గా మార్పు చేసినట్లు అనుమతి ఇవ్వాలి. ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిలో అయితే మున్సిపల్ అధికారులు లేదా కుడా అనుమతి పొందాలి. ఇవేవీ లేకుండానే వెంచర్లు వేసి పనులు కానిచ్చేస్తున్నారు.

### వ్యవసాయ భూముల్లో అక్రమ లే అవుట్లు :

రియల్ ఎస్టేట్ వ్యాపాలు నందికొట్కూరు లో రూ. లక్షలతో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేసి అ భూమిని రూ. కోట్లుగా మారుస్తున్నారు. కనీస అనుమతులను పొందకుండానే ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు చేసుకుంటున్నారు. నందికొట్కూరు పట్టణంలోనిబ్ నాగలూటి రోడ్డులో హాస్పిటల్ వెనక, దామగట్ల, బొల్లవరం, మండ్లెం, వీపనగండ్ల గ్రామాలకు చెందిన వ్యవసాయ భూముల్లో భారీగా లేఅవుట్లు రియల్ వ్యాపారులు వేశారు. ఆ భూ కొనుగోలు చేసిన వెంటనే ప్రైవేట్ సర్వేయర్లతో కుమ్మకై భూములన అవుట్లుగా మారుస్తున్నారు. వెంటనే వాటిని విక్రయించి సొమ్ము చేసుకొంటూ రియల్ దందా కొనసాగిస్తున్నారు.



### నామమాత్రంగా అధికారుల దాడులు - మామూళ్లు ఇస్తే వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు :

నందికొట్కూరు పట్టణంలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై మున్సిపల్ అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తు, రియల్ వ్యాపారులు ఇచ్చే మామూళ్లు తీసుకొని వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముక్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ దందా కొనసాగిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ముందుగా నోటీసులు ఇవ్వడం, ఆ తర్వాత వెంచర్లలో పాతిన రాళ్లను తొలగించడం నామమాత్రంగా చేస్తూ వెళ్తున్నారు. ప్రతి వెంచర్లో అధికారులు ఒకసారైనా వేసిన రాళ్లను తొలగించాల్సిందే. ఒక సారి తొలగించి తిరిగి పాతిన రాళ్లను అధికారులు ముట్టుకున్న దాఖలాలు లేవు. దీని వెనుక ఆంతర్యం ఏమిటో మున్సిపల్ అధికారులే చెప్పాలని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## రెవెన్యూ గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటిని ఘనంగా సన్మానించిన

**డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల కార్పొరేటర్ విమలాదేవి దంపతులు**





భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 04 ( తొలివార్త ):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గం, లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని రేగళ్ళ గ్రామంలో పర్యటించారు. మంత్రితోపాటు భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా డిసిసి అధ్యక్షురాలు దేవి ప్రసన్న, జిల్లా డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన లక్ష్మీదేవిపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ,కార్యకర్తల,విస్తృతసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గంలోని కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కొత్తగూడెం కార్పొరేషన్ కార్పొరేటర్లు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా,డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, పాతపాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ని ఘనంగా శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు అభిమాను లు తదితరులు పాల్గొన్నారు.

## రామిశెట్టి ఆదిలక్ష్మి దశదిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



భద్రాద్రి జిల్లా **అక్టోబర్ 04 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణ కేంద్రంలో చర్ల రోడ్‌లోని కె.కె. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన, డీసీఎం 9 న్యూస్, అధినేత రామిశెట్టి కార్తీక్ మాతృమూర్తి రామిశెట్టి ఆదిలక్ష్మి దశదిన కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి,ఘనంగా,నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, నర్రా రాము, తాళ్ళపల్లి రమేష్ గౌడ్, దుద్దికురి సాయిబాబా వార్డు సభ్యులు కారం దుర్గారావు, పట్టణ ప్రముఖులు రామలింగేశ్వర రావు, మీడియా ప్రతినిధులు కుప్పాల నాగరాజు, ముద్దుకృష్ణ, ఆనంద్, నాగేంద్ర యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గా ఉత్సవాలు.. ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక..!

**20వ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం**

**అధ్యక్షులుగా తాడూరు వెంకటేశం**





చౌటుప్పల్, **అక్టోబర్ 04 ( తొలివార్త ):** చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో శ్రీ దుర్గా ఉత్సవ కమిటీ 20వ సంవత్సరం నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చౌటుప్పల్ పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్,ముత్యాల హనుమంతు రెడ్డిలను ఎన్నుకోగా, అధ్యక్షుడిగా తాడూరు వెంకటేశం,ప్రధాన కార్యదర్శిగా జక్కర్తి శేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తాడూరు వెంకటేశం మాట్లాడుతూ.. 20వ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కమిటీ సభ్యులు,భక్తులు సహకరించాలని కోరారు. తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు తాడూరు వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటామని చెప్పారు.

## ఖమ్మం నల్గొండ వరంగల్

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిడిపి అభ్యర్థి గా

**హైకోర్టు అడ్వకేట్ సోడే వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎంపిక చేసిన పిఎసి**




భద్రాచలం **అక్టోబర్ 04 ( తొలివార్త ):** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో గోండ్వానా దండకారణ్య పార్టీ జిడిపి, పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ పిఎసి చైర్మన్ గుండు శరత్ తెలిపారు.ఆదివారం జరిగిన గోండ్వానా దండకారణ్య పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుండు శరత్ తెలిపారు. సమావేశ వివరాలను ఆయన ప్రెస్ అండ్ ప్రింట్ మీడియాకు విడుదల చేశారు.ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా, విద్యార్థి మరియు యువజన నాయకుడిగా పనిచేస్తున్న తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ సోడేవెంకటేశ్వర్లును ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం అభ్యర్థిగా గోండ్వానా దండకారణ్య పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు గుండిశరత్ వెల్లడించారు.పట్టభద్రుల సమస్యలు, విద్యార్థులు--యువత సమస్యలు, ఆదివాసీలు మరియు బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పార్టీ తరఫున తమ అభ్యర్థి గా ప్రజల ముందుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో జిడిపి, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఎస్. వెంకట్, కొమరం అనిల్ కుమార్, ఎం. సాయిబాబు, వజ్జ జ్యోతి బసు, ఎం.వి. రావు తదితరులు పాల్గొన్నారు.గోండ్వానా దండకారణ్య పార్టీ,పొలిటికల్ అఫైర్స్ కమిటీ పిఎసి,

## పిర్జాదిగూడలో 'ఏబి న్యూ లైఫ్ హాస్పిటల్'

# ఉచిత మెగా వైద్య శిబిరం



మేడిపల్లి, **అక్టోబర్ 04 ( తొలివార్త ):** ఏబి న్యూ లైఫ్ హాస్పిటల్ సౌజన్యంతో పిర్జాదిగూడలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి పిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై,శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి శ్రీరాములు మాట్లాడుతూ... ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏబి న్యూ లైఫ్ హాస్పిటల్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను స్థానిక ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో ఏబి న్యూ లైఫ్ హాస్పిటల్ నిపుణులైన వైద్య బృందం పాల్గొని, విచ్చేసిన ప్రజలకు ఉచితంగా వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు (జనరల్ చెకప్) నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సాగు భూముల్లో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్




వ్యవసాయ భూమిని వ్యవసాయేతర ప్రయోజనాలకు వినియోగించుకునేందుకు అనుమతులు తీసుకోకుండానే నిర్మించిన నివాసాల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కోర్టు కేసులు, న్యాయ వివాదాలు ఉన్నవి మినహా అన్నింటినీ పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ వెల్లడించింది.సాగు భూముల్లో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ నాలా సమస్య పరిష్కారానికి మెమో జారీ చేసింది. కోర్టు కేసులు, న్యాయ వివాదాలు ఉన్నవి మినహా అన్నింటినీ పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ వెల్లడించింది. ఇక నుంచి అలాంటి ఆస్తులపై రుణాలు, క్రయ విక్రయాలకు అవకాశం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఊరట లభించనుంది.వ్యవసాయ భూమిని వ్యవసాయేతర ప్రయోజనాలకు వినియోగించుకునేందుకు అనుమతులు తీసుకోకుండానే నిర్మించిన నివాసాల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇన్నేళ్లుగా ఈ తరహా భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిత జాబితాలో కొనసాగిస్తూ వస్తున్నారు. 22ఏ సమస్యలను పరిష్కరిస్తామంటూ ఇటీవల అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ శాఖ నాలా సమస్య పరిష్కారానికి మెమో జారీ చేసింది. కోర్టు కేసులు, న్యాయ వివాదాలు ఉన్నవి మినహా నాలా అనుమతుల కోసం వచ్చే దరఖాస్తుల్లో అర్హత ఉన్న వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ వెల్లడించారు.రాష్ట్రంలో నాలా అనుమతులు లేని ఆస్తులు వేల సంఖ్యలో ఉన్నాయని, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అలాంటి నివాసాల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నాలా అనుమతులు తీసుకోని కారణంగా ఏళ్లుగా సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి నాలా అనుమతులు లభిస్తే రిజిస్ట్రేషన్లకు వీలు కలుగుతుందన్నారు. ఇక నుంచి ఇలాంటి ఆస్తులపై రుణాలు పొందడానికి, క్రయవిక్రయాలకు అవకాశం లభిస్తుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో సాగుభూములు ఆవాస ప్రాంతాలుగా మారుతున్నప్పటికీ రికార్డుల్లో మాత్రం అవి సాగు భూములుగానే కొనసాగుతున్నాయి. వాస్తవంగా సాగు భూముల్లో నివాసాలు చేపట్టాలంటే తప్పనిసరిగా నాలా చట్టం కింద ఫీజు చెల్లించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జీహెచ్ఎంసీ పరిధిలో దశాబ్దాలుగా అనుమతి లేకుండా సిద్ధం చేసిన వేల సంఖ్యలో లే అవుట్లు, వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు.ఇటు చాలా జిల్లాల్లో వ్యవసాయ భూముల్లో నివాసాలు, ఇతరత్రా నిర్మాణాలు చేపట్టినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం సాగుభూముల కిందే ఉన్నాయి. ప్రభుత్వం సాగు భూములకు రైతు భరోసా ఇస్తున్న నేపథ్యంలో ఏటా రూ.కోట్లలో ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతోంది. నాలా అనుమతులు పొందేందుకు, రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమైన నేపథ్యంలో ఇకపై రైతు భరోసా నిధులు పక్కదారి సైతం పట్టకుండా ఉంటాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# అమరావతి రైల్వేలైన్ - వడ్డమాను టూ నంబూరు వరకు కూ.. చుక్ చుక్!

**అమరావతి మీదుగా ఎర్రుపాలెం**

**నంబూరు రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మించనున్నారు**

**దీనిలో భాగంగా నాలుగో ప్యాకేజీకి రైల్వేశాఖ ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది**

**నవంబరు 23 వరకు బిడ్ల దాఖలుకు గడువు ఇచ్చారు**




అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. దీనిలో భాగంగా నాలుగో ప్యాకేజీకి రైల్వేశాఖ ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. ఎర్రుపాలెం నుంచి కృష్ణా నది దాటాక వడ్డామాను వరకు మూడు ప్యాకేజీలకు టెండర్లు పిలవగా, ఇప్పుడు చివరిదైన నాలుగో ప్యాకేజీకి కూడా మోక్షం లభించింది. రాజధాని ప్రాంతంలోని వడ్డామాను నుంచి నంబూరు వరకు 28.35 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణానికి రూ.599.33 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. బిడ్లు సమర్పించేందుకు నవంబరు 23 తుది గడువుగా నిర్ణయించారు. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం ఈపీసీ విధానంలో చేయనున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సంస్థ నిర్మాణ పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఇంజినీర్లు పేర్కొన్నారు.ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే లైన్ ప్రాజెక్ట్ మొత్తం 58.10 కిలోమీటర్ల మేర విస్తరించనున్నారు. కాగా దీన్ని 4 ప్యాకేజీలుగా నిర్మించనున్నారు.ఖమ్మం జిల్లా పరిధిలో ఎర్రుపాలెం నుంచి పెద్దాపురం సమీపం వరకు తెలంగాణ పరిధిలో 3.5 కిలోమీటర్లు మొదటి ప్యాకేజీగా ఉంది. దీనికి టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థను ఎంపిక చేశారు.ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పెద్దపురం నుంచి కృష్ణా నది వంతెన వరకు రైల్వేలైన్ నిర్మాణానికి రెండవ ప్యాకేజీకి టెండర్లు పిలిచారు.కృష్ణా నదిపై 3.23 కిలోమీటర్ల మేర వంతెనతో పాటు పల్నాడు జిల్లాలోని వడ్డమాను వరకు రైల్వే లైన్ నిర్మాణ పనులను మూడో ప్యాకేజీగా టెండరు పిలిచారు.ఎన్టీఆర్ జిల్లాలో 152.40 హెక్టార్ల మేర భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తయిన వెంటనే 2,3 ప్యాకేజీల టెండర్లు ఖరారు చేయనున్నారు.ప్రస్తుతం వడ్డమాను నుంచి నంబూరు వరకు ఉన్న 28.35 కిలోమీటర్లు నాలుగో ప్యాకేజీకి తాజాగా బిడ్లు (టెండర్లు) ఆహ్వానించారు.నాలుగో ప్యాకేజీలో రైల్వే లైన్ నిర్మాణానికి పల్నాడు జిల్లాలో 48.527 హెక్టార్లు, గుంటూరు జిల్లాలో 181.16 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భూములను సేకరణ కాకుండా సీఆర్‌డీఏ భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) విధానాన్ని అమలు చేస్తోంది.ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌లో 9 చోట్ల రైల్వే స్టేషన్లను నిర్మించనున్నారు.పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరులలో స్టేషన్లు నిర్మాణం చేపట్టనున్నారు. అమరావతి రైల్వే స్టేషన్‌ను విశాలమైన సదుపాయాలతో నిర్మించనున్నారు.2024 నవంబరులో ఈ ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు, దీని అంచనా వ్యయం రూ.2,047 కోట్లుగా పేర్కొన్నారు.

## 16 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడి అత్యాచార యత్నం

**బాలికను ఇంటి వద్ద దింపుతానంటూ బైక్‌పై ఎక్కించుకున్న వృద్ధుడు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 04 ( తొలివార్త ):** అశ్వాపురం మండలం బుడుగు బజార్ చెందిన 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తన ఇంటి సమీపంలో నివసించే బాలికపై కన్నేసిన రాయల కోటయ్య (60) అమ్మాయి ఒంటరిగా ఉన్న సమయంలో అడ్డగించి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.భద్రాచలంలో ఇంటర్ చదువుతున్న బాలిక రామచంద్రాపురం బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా.. అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న కోటయ్య ఆమెను గమనించాడు. ఇంటి వద్ద దింపుతానని చెప్పి బాలికను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత బైక్‌ను ఆపి బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు ఫిర్యాదులో,పేర్కొన్నారు.అయితే బాలిక అతని నుంచి తప్పించుకుని అక్కడి నుంచి బయటపడింది.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

## యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 04 ( తొలివార్త ):ప్రతి నిధి.** ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఆయన ఒక పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై, ప్రభుత్వ పథకాల అమలుపై నిర్భయంగా వార్తలు రాస్తూ ప్రజల పక్షాన నిలబడే జర్నలిస్టుల జీవితాలు నేడు అనేక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే ఇళ్ల స్థలాలను కేటాయించాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం, హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని, వృత్తిపరంగా వేధింపులకు గురవుతున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## రూ.72 లక్షల సిఎంసీ నిధులతో

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 04 ( తొలివార్త ): ప్రతి నిధి.** మహదేవపురంలోని ప్లాట్ నంబర్లు 139-160, 160-171, 195-200, 194-182తో పాటు ఆర్ కె టౌన్‌షిప్ ప్రాంతాల్లో గత పదేళ్లుగా రోడ్ల నిర్మాణం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం సిఎంసీ నిధుల ద్వారా రూ.72 లక్షలు కేటాయించింది.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన హన్మంతన్నకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, విజయ్ రెడ్డి, వెంకట్రావు, బండారి లేఔట్ అధ్యక్షులు వరగాని వాసు, అల్లాడి మహేష్, తిరుమల, ఆర్ కె టౌన్‌షిప్ అసోసియేషన్ మరియు కాలనీ సభ్యులు వినయ్ కుమార్, సంతోష్ అల్లెంకి, దేశాయి రెడ్డి, సతీష్ వాటికుట్టి, సురేష్ వాలంకొండ, రాజా చౌదరి, వెంకట్ ఆలపాటి, నాగరాజ్ సామల్లేటి, డాక్టర్ వెంకన్న, నాగరాజు రావూరి, కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణ, పటిష్ట నిఘా ఏర్పాటులో సీసీ కెమెరాలు ఎంతగానో

## ఉపయోగ పడతాయి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 04 ( తొలివార్త ):ప్రతి నిధి.** ఈరోజు సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ విజయదుర్గా కాలనీ (జీపీఆర్) లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని, కాలనీలోకి వచ్చి వెళ్లే రహదారులను గుర్తించి సీసీ కెమెరా ఏర్పాటు ద్వారా సేఫ్ అండ్ స్మార్ట్ కాలనీగా విజయదుర్గ కాలనీ నిలుస్తుంది అన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోలీసులతో కలిసి స్ట్రాటజిక్ పాయింట్లను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీ రక్షణ మరింత బలపడుతుందన్నారు. అదేవిధంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో త్రాగునీటి, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా విజయ దుర్గా కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, రాము రాథోడ్, డీఈ పాపమ్మ, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ అధికారులు, మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, విజయ దుర్గ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్యాంసింగ్, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సభ్యులు ఎస్. రాకేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుమన్, వైయస్, బి. సందీప్, విశ్వనాథ రెడ్డి, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, బాలాజీ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, మధుసూదన్ రెడ్డి, చంద్రయ్య, బొబ్బ శ్రీను, పోతినేని ప్రవీణ్, యశ్వంత్, మహమ్మద్ సలీం, మహిళా నాయకురాలు లతా రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల డిపో వద్ద నేడు ఆర్ టి సి జాయింట్ యాక్షన్

## కూటమి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నుండి సంగీభావం తెలుపుతూ.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 04 ( తొలివార్త ): ప్రతి నిధి.** మేడ్చల్ జిల్లా పరిధిలోని జీడిమెట్ల డిపో వద్ద నేడు ఆర్ టి సి జాయింట్ యాక్షన్ కూటమి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నుండి సంగీభావం తెలుపుతూ ఈ నెల 9వ తారీకున జరిగే ఎన్నికల్లో ఎంప్లయిస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థులను బస్, నిచ్చెన గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని గేట్ మీటింగులో కార్మికులని కలసి ప్రచారం చేసి పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ నాడు ఆర్ టీ సి కార్మికుల అండదండలతో అధికారశీ చలాహించిన బి ఆర్ ఎస్ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడ ఆర్ టీ సి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తానని మాయ మాటలు చెపుతున్నారని ఎలక్ట్రిక్ బస్ లను తీసుకొచ్చి కార్మికులను ఇష్టమొచ్చినట్టు ట్రాన్స్‌ఫర్ చేసి ఆటలాడుకొందని వారి మాయ మాటలకు మోసపోకుండా గమనించాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమములో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జీడిమెట్ల డిపో యూనియన్ కార్యదర్శి డానియల్, కత్బుల్లాపూర్ నియోజక అధ్యక్ష కార్యదర్శిలు హరినాథరావు, స్వామి, జేఏసీ నాయకులు, యవజన నాయకులు ప్రవీణ్,పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

## రెడ్లరేపాకలో ఘనంగా బోనాల ఉత్సవాలు





**వలిగొండ, అక్టోబర్ 04 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో బోనాల ఉత్సవాలను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పుల దరువుకు అనుగుణంగా యువకులు, పిల్లలు బోనాల ముందు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు సంప్రదాయ బోనాల పాటలు పాడుతూ భక్తి భావాన్ని చాటుకున్నారు. గ్రామంలోని వీధులు బోనాల ఊరేగింపుతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో పండుగను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కందుల మహేష్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ జాయింట్ సెక్రెటరీ, అడ్వకేట్ కందుల రాకేష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ కందుల సందీప్ కుమార్, భాస్కర్, ప్రవీణ్, రామకృష్ణ, వెంకటేష్, ఉదయ్, మహిళలు కందుల లక్ష్మి, సుమలత, యాదమ్మ, ఆదిలక్ష్మి, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

## చిల్పకుంట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను

# అర్హులైన నిరుపేదలకే పంపిణీ చేయాలి..

**డ్రా పద్ధతిన పంపిణీ చేయాలి**



**నూతనకల్, అక్టోబర్ 04 ( తొలివార్త ):** అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని చిల్పకుంట్ల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పులుసు లింగమల్లయ్య అధికారులను కోరారు.ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసే క్రమంలో డ్రా పద్ధతిన పంపిణీ చేయాలని ఉద్దేశంతో డ్రా తీయడం జరిగిందని,కొన్ని అనివార్యకారణాల వలన ఆ ఇండ్ల పంపిణీ ఆగిపోయిందని, మరల ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ జరుగనున్నట్లు సమాచారం వచ్చిందని ఆ పంపిణీ అధికారుల ఆధ్వర్యంలో నిరుపేదలైన అర్హులకే చెందే విధంగా తగిన చర్యలు తీసుకుని డ్రా పద్ధతిన ఇండ్ల పంపిణీ చేయాలని,అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను వారు కోరారు. ఈ డ్రా పద్ధతిని గ్రామపంచాయతీ ఆవరణంలో బహిర్గతంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిక్కి బుచ్చయ్య గౌడ్,బత్తుల విద్యాసాగర్ బత్తుల విజయ్ కుమార్ బత్తుల గురువయ్య బత్తుల వెంకన్న భక్తుల గాంధీ భక్తుల మధుకర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని

# రెవెన్యూ మంత్రి పొంగులేటికి వినతి....

**ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 04 ( తొలివార్త ):** జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జర్నలిస్టులు వినతిపత్రం అందచేశారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన పొంగులేటిని లక్ష్మీదేవి పల్లి మండలంలోని రేగళ్లలో జరిగిన సమావేశంలో జర్నలిస్టులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిన జర్నలిస్టులు సొంత ఇళ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లజిస్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. గతంలో జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల నిమిత్తం రామవరం వంతెన సమీపంలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని, కొన్ని అనివార్య కారణాలతో స్థలాల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయిందని అన్నారు. త్వరితగతిన అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు..... త్వరలో ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరిస్తా..... జర్నలిస్టులో ఇళ్లస్థలాల సమస్య నా దృష్టిలో ఉందని ఈ సమస్యను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు జర్నలిస్టులు కల్లోజి శ్రీనివాస్, వీరు నాయక్,నాగచంద్ర. వట్టికొండ రవి, తారక్, పాపారావు. రాజేష్. జర్నలిస్టులు. నరసింహారావు.అశోక్. పురుషోత్తం. ఈశ్వర్.శ్యామ్.లింగయ్య. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి జాతీయఅంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్**



**కొత్తగూడెం అక్టోబర్ 04 ( తొలివార్త ):** అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఒలింపిక్ జెండాను ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా నాగా సీతారాములు యాదవ్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, బాలురతో పాటు బాలికలు కూడా అధిక సంఖ్యలో అథ్లెటిక్స్‌లో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఎండను,సైతం,లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో,పాల్గొనడం, అభినందనీయమన్నారు .అథ్లెటిక్స్ ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో మహీధర్ రెడ్డి, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ మందుల వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ కోచ్ డి. మల్లికార్జునరావు, కోచ్‌లు ఎం. నాగరాజు, పి. నాగేందర్, జె. గిరిప్రసాద్, షేక్ రియాజ్ పాషా, కిన్నెరసాని ప్రసాద్, ఐటీడీఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ నారాయణ, ఈశ్వర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రెజరర్ బి. హనుమంతరావు, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంజులాల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది రామకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం

**మానవత్వం చాటుకున్న తోటి స్నేహితులు**




**శాలిగౌరారం, అక్టోబర్ 04 ( తొలివార్త ):** శాలిగౌరారం మండలం తుడిమిడి గ్రామానికి చెందిన పెద్ది రామకృష్ణ గౌడ్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబానికి అండగా స్నేహితులు ముందుకు వచ్చారు. మానవతా దృక్పథంతో 8 మంది మిత్రులు కలిసి 15,000/- లను ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈకార్యక్రమంలో మాదగోని నర్సింహ, నలమాద వెంకన్న, చెవుగాని సుధాకర్, మాదగోని యాదగిరి, బొమ్మగోని నాగరాజు, వల్లపు మహేష్, యల్మకంటి రాము, బండపల్లి నరేష్.పాల్గొన్నారు

## చీ..ఉలవలు తింటారా అనుకోవద్దు..
# రేసు గుర్రంలా ఉరికే ఆరోగ్యం కోసం..



జ్వరం, ఆయాసం, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉలవల కషాయం తాగడం ఎంతో మేలు. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. అంతేకాదు.. తరచూ ఎక్కిళ్లు వచ్చేవారికి ఉలవలు మంచి మందులా పనిచేస్తుంది. తరచూ ఉలవలు తీసుకోవడం వల్ల ఎక్కిళ్ల సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందుతారు. ఉలవలు..మంచి బలవర్ధకమైన ఆహారం. మన శరీరానికి శక్తిని అందించడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉలవల్లో ఫైబర్ పుష్కలగా ఉంటుంది. ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, పీచుపదార్థం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఊబకాయం సమస్య ఉన్నవారు ఉలవలను తినటం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఉలవల్లోని ఫైబర్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ కరిగించడంలో దోహదపడుతుంది. తద్వారా బరువు అదుపులో ఉంచుతుంది. మూత్ర సంబంధిత సమస్యలు నివారించడంలో ఉలవలు సహాయపడతాయి. దీనికోసం ఓ కప్పు ఉలవ చారుకు సమానంగా కొబ్బరి నీళ్లు తీసుకుంటే మూత్రంలో మంట తగ్గుతుంది. తరచూ మూత్రంలో మంటతో బాధపడేవారు ఈ చిట్కా పాటించండి. జ్వరం, ఆయాసం, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉలవల కషాయం తాగడం ఎంతో మేలు. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. అంతేకాదు.. తరచూ ఎక్కిళ్లు వచ్చేవారికి ఉలవలు మంచి మందులా పనిచేస్తుంది. తరచూ ఉలవలు తీసుకోవడం వల్ల ఎక్కిళ్ల సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందుతారు. కిడ్నీ సమస్యల నుంచి ఉపశమనం కల్పించడంలో ఉలవలు దోహదపడతాయి. వీటిలోని పోషకాలు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా రక్షిస్తాయి. అంతేకాదు హృదయ సంబంధ సమస్యలు రాకుండా ఉలవలు రక్షిస్తాయి. పిల్లల ఎదుగుదలకు ఉలవలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి సహాయపడతాయి. వారికి బలాన్ని ఇస్తాయి. అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడతాయి. చర్మ సమస్యల నివారణలో, కీళ్ళ నొప్పుల నివారణలో బాగా పని చేస్తాయి.

## చియా సీడ్స్, నల్ల ఎండు ద్రాక్ష కలిపి
# నానపెట్టి తీసుకుంటే ఇన్ని లాభాలా..?



చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాల నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయి. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర, ప్రోటీన్ కలిగి ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది.

## పొరపాటున కూడా ఉదయం ఖాళీ
## కడుపుతో ఇవి అస్సలు తినకండి.. పెద్ద ప్రమాదమే!



ఉదయం అల్పాహారంలో తినడం వల్ల కడుపులో అసౌకర్యం, శక్తి లేకపోవడం లేదా పోషకాలను సరిగా గ్రహించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజు మీ అల్పాహారం సమతుల్యంగా ఉండటం ముఖ్యం. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి.. కొన్ని ఆహారాలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. కానీ ఉదయం అల్పాహారంలో వాటిని తినడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు వైద్య నిపుణులు. కొన్ని ఆహారాలను ఖాళీ కడుపుతో తినడం వల్ల మీ శరీరంపై ప్రతిచర్యలు కలుగుతాయి. ఈ ఆహారాలలో పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆమ్లత్వం, ఫైబర్, చక్కెర అధికంగా ఉండే ఈ పదార్థాలను ఉదయం అల్పాహారంలో తినడం వల్ల కడుపులో అసౌకర్యం, శక్తి లేకపోవడం లేదా పోషకాలను సరిగా గ్రహించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజు మీ అల్పాహారం సమతుల్యంగా ఉండటం ముఖ్యం. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఉదయాన్నే మీరు ఏమి తినకూడదో తెలుసుకుందాం. సిట్రస్ పండ్లు: సిట్రస్ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటి అధిక ఆమ్లత్వం ఖాళీ కడుపుతో తింటే కడుపు పొరను చికాకుపెడుతుంది. ఇది ముఖ్యంగా యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారిలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**పచ్చి కూరగాయలు:** పచ్చి కూరగాయలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటిలో కరగని ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిని ఖాళీ కడుపుతో తింటే హానికరం కావచ్చు. ఉదయం వాటిని తినడం వల్ల ఉబ్బరం, గ్యాస్ లేదా కడుపు తిమ్మిర్లు వస్తాయి.

**గ్రానోలా:** ప్రజలు తరచుగా వాటిని ప్రయోజనకరంగా భావిస్తారు, కానీ గ్రానోలాలో అధిక మొత్తంలో చక్కెర మరియు శుద్ధి చేసిన నూనె ఉంటాయి. ఉదయం ఖాళీ కడుపుతో చక్కెరతో కూడిన వస్తువులను తినడం వల్ల శక్తి తగ్గుతుంది.

**గ్రీన్ స్మూతీ:** కాలే, పాలకూర వంటి ఆకు కూరలు ఆరోగ్యకరమైనవి. కానీ మీరు వాటిని పచ్చిగా తింటే వాటిలో అధిక మొత్తంలో ఆక్సలేట్, ఫైబర్ ఉంటాయి. ఖాళీ కడుపుతో వీటిని తీసుకోవడం వల్ల కాల్షియం లోపం నిరోధించవచ్చు. దీనివల్ల మీరు ఉబ్బరం లేదా గ్యాస్ వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఎల్లప్పుడూ ఉడికించిన వాటిని తినండి.

**టమోటాలు:** యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. టమోటాలు చాలా పుల్లగా ఉంటాయి. అల్పాహారంగా వీటిని తినడం వల్ల కడుపు పొర చికాకు కలిగిస్తుంది. కాలక్రమేణా గ్యాస్ట్రిటిస్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను పెంచుతుంది.

**అరటిపండ్లలో.. :** పొటాషియం పుష్కలంగా ఉంటుంది. కానీ చక్కెర అధికంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. రక్తంలో మెగ్నీషియం అకస్మాత్తుగా పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది.

# స్వీట్లు తిన్న 30 నిమిషాల్లో.. శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

**చక్కెర తిన్న 30 నిమిషాల్లోనే శరీరంలో కీలక మార్పులు**

**అధిక చక్కెర వాడకం కాలేయం, గుండె ఆరోగ్యానికి చేటు**

**ఘన పదార్థాల కన్నా కూల్ డ్రింక్స్‌లోని చక్కెర మరింత ప్రమాదకరం**

**శీతల పానీయాలతో టైప్-2 డయాబెటిస్ ముప్పు 20 శాతం అధికం**

**రోజుకు 25 గ్రాములకు మించి చక్కెర వాడొద్దని డబ్ల్యూహెచ్‌ఓ సూచన**



మనం ఇష్టంగా తినే స్వీట్లు, చక్కెర పదార్థాలు నోటికి రుచిని పంచినా, అవి తిన్న కేవలం అరగంటలోనే మన శరీరంలో పెను మార్పులకు కారణమవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చక్కెర శరీరంలోకి చేరగానే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీనిని అదుపులోకి తెచ్చేందుకు ప్యాంక్రియాస్ ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇదే సమయంలో మెదడులో 'డొపమైన్' అనే హార్మోన్ విడుదలై తాత్కాలికంగా ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తుంది.అయితే ఈ ఉత్సాహం కొద్దిసేపే ఉంటుంది. అరగంట తర్వాత రక్తంలోని చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోవడంతో 'షుగర్ క్రాష్'కు గురవుతాం. దీనివల్ల నీరసం, మళ్లీ ఆకలిగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం**

అధిక చక్కెర వినియోగం కాలేయంపై తీవ్ర ఒత్తిడిని కలుగజేస్తుంది. అదనపు చక్కెరను కాలేయం కొవ్వుగా మార్చడం వల్ల కాలక్రమేణా 'ఫ్యాటీ లివర్' సమస్య తలెత్తుతుంది. అంతేకాకుండా, రక్తనాళాల్లో వాపు (ఇన్‌ఫ్లమేషన్) ఏర్పడి గుండె సంబంధిత వ్యాధుల ముప్పు పెరుగుతుంది. చర్మంపై ముడతలు రావడం, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలకు కూడా అధిక చక్కెర వాడకమే కారణమని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.ఇటీవల జరిపిన పరిశోధనల ప్రకారం మనం తినే ఘన పదార్థాల కన్నా శీతల పానీయాల్లోని 'లిక్విడ్ షుగర్' కేవలం 15 నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోతుందని తేలింది. దీనివల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 20 శాతం అధికంగా ఉంటుందని ప్రముఖ వైద్య పత్రిక 'ల్యాన్సెట్' తన కథనంలో పేర్కొంది. చక్కెరను పూర్తిగా మానేయడం కష్టమైనప్పటికీ, రోజుకు 25 గ్రాములకు మించి తీసుకోకపోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సూచిస్తోంది.

# మీ బడ్జెట్?లో యూరప్ ట్రిప్.. టాప్ 5 చౌక యూరప్ దేశాలు ఇవే..







యూరప్‌కు వెళ్లడం ఎల్లప్పుడూ ఖరీదైనదిగా ఉండనవసరం లేదు. చాలా మంది యూరప్ అంటే పారిస్, లండన్ లేదా రోమ్ వంటి పెద్ద నగరాలు అని అనుకుంటారు. ఇది చాలా ఖరీదైనది కావచ్చు. కానీ నిజం ఏమిటంటే యూరప్‌లో చాలా అందమైన, సరసమైన దేశాలు ఉన్నాయి. ఇక్కడ మీరు ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా గొప్ప సమయాన్ని గడపవచ్చు. యూరప్‌లోని 5 చౌక దేశాలు ఏంటి.? ఈరోజు తెలుసుకుందాం..

**బల్గేరియా:** యూరప్‌లో సందర్శించడానికి అత్యంత చౌకైన ప్రదేశాలలో బల్గేరియా ఒకటి. రంగులు, చరిత్రతో నిండిన ప్లోవ్‌డివ్ పాత పట్టణం గుండా మీరు నడవవచ్చు. ఎండ ఎక్కువగా ఉండే, రద్దీగా లేని నల్ల సముద్రం వెంబడి ఉన్న బీచ్‌లను కూడా మీరు ఆస్వాదించవచ్చు. మీరు ప్రకృతిని ఇష్టపడితే, హైకింగ్ లేదా స్కీయింగ్ కోసం పర్వతాలను వీక్షించవచ్చు. ఇక్కడ ఆహారం చౌకగా, రుచికరంగా ఉంటుంది. పబ్లిక్ బస్సులు, రైళ్లు ఉపయోగించడానికి సులభమైనవి, చాలా సరసమైనవి. డబ్బు ఆదా చేయాలనుకునే ప్రయాణికులకు ఈ దేశం నిజంగా మంచిది.

**రొమేనియా:** రొమేనియా ఒక అద్భుత కథలోని ప్రదేశంలా అనిపిస్తుంది. మీరు డ్రాక్యులా కోట అని పిలువబడే ప్రసిద్ధ బ్రాన్ కోట వంటి కోటలను సందర్శించవచ్చు. ఈ దేశం పచ్చని కొండలు, ప్రశాంతమైన గ్రామాలు, పాత సంప్రదాయాలతో నిండి ఉంది. ట్రాన్సిల్వేనియా అన్వేషించడానికి గొప్ప ప్రాంతం, మీరు హైకింగ్ లేదా ప్రకృతి పర్యటనలను ఇష్టపడితే కార్పాతియన్ పర్వతాలు ఉన్నాయి. రాజధాని బుకారెస్ట్‌లో చాలా పార్కులు, మ్యూజియంలు, చూడటానికి సరదా ప్రదేశాలు ఉన్నాయి. ఉత్తమ భాగం ఏమిటంటే ప్రతిదీ చాలా ఇతర యూరోపియన్ దేశాల కంటే చాలా చౌకగా ఉంటుంది.

**అల్బేనియా:** అల్బేనియా అంతగా ప్రసిద్ధి చెందలేదు. కానీ ఇది యూరప్‌లోని ఉత్తమ బడ్జెట్ గమ్యస్థానాలలో ఒకటి. ఇది గ్రీస్‌లో ఉన్న బీచ్‌ల మాదిరిగానే కనిపించే శుభ్రమైన నీలిరంగు బీచ్‌లను కలిగి ఉంది. ప్రజలు దయగలవారు. ఆహారం తాజాగా మరియు రుచితో నిండి ఉంటుంది. రాతి ఇళ్ళు, అద్భుతమైన దృశ్యాలను కలిగి ఉన్న బెరాట్, జిరోకాస్టర్ వంటి పాత పట్టణాలను మీరు సందర్శించవచ్చు. ఎక్కువ మంది పర్యాటకులు ఉండరు కాబట్టి ఇది మరింత ప్రశాంతంగా, ప్రత్యేకంగా అనిపిస్తుంది. బీచ్ సంస్కృతి, పొదుపు కోరుకునే వ్యక్తులకు అల్బేనియా సరైనది.

**పోలాండ్:** పోలాండ్ చరిత్ర, ఆకర్షణలతో నిండి ఉంది. క్రాకో, వార్సా వంటి నగరాల్లో అందమైన వీధులు, పాత భవనాలు, ఆనందించడానికి చాలా సంస్కృతి ఉన్నాయి. క్రాకో చౌకగా, శక్తితో నిండినందున విద్యార్థులు, బ్యాక్‌ప్యాకర్లకు చాలా నచ్చుతుంది. మీరు రుచికరమైన పోలిష్ ఆహారాన్ని ప్రయత్నించవచ్చు. మ్యూజియంలను సందర్శించండి. ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా నడక పర్యటనలకు వెళ్లండి. మీరు ప్రకృతిని ఇష్టపడితే పోలాండ్‌లో అందమైన గ్రామీణ సరస్సులు, అడవులు కూడా ఉన్నాయి. మీరు బడ్జెట్‌లో ప్రయాణిస్తుంటే యూరప్‌లో వెళ్ళడానికి ఇది ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి.

**హంగేరీ:** బడ్జెట్ ప్రయాణికులకు హంగేరీ మరో అగ్ర ఎంపిక. రాజధాని నగరం బుడాపెస్ట్ వెచ్చని స్నానపు గదులు, వంతెనలు, అద్భుతమైన భవనాలకు ప్రసిద్ధి చెందింది. ఇది గతం నుంచి వచ్చిన నగరంలా కనిపిస్తుంది. కానీ ఇప్పటికీ జీవితం, వినోదంతో నిండి ఉంది. మీరు చౌకైన ఆహారం, చౌకైన బస స్థలాలను కనుగొనవచ్చు. ఇది సుదీర్ఘ పర్యటనలకు గొప్పగా చేస్తుంది. దేశంలోని ఇతర ప్రాంతాలలో కోటలు, చిన్న పట్టణాలు, సరస్సులు కూడా ఉన్నాయి. హంగేరీ అందం, చరిత్ర కలిగి ఉంది.

# అరటి పండు తిన్న తర్వాత ఈ పదార్థాలు తింటున్నారా..? మీ లైఫ్ డెంజర్‌లో పడినట్టే..





అరటి పండులో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని పోషకాల పవర్ హౌస్ అంటారు. ఈ పండులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. దీన్ని తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటి పండులో మెగ్నీషియం, పొటాషియం, పీచు మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అరటి పండుతో అనేక ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని ఫుడ్స్‌తో కలిపి తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి ఆహారాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినకూడదు. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినడం వల్ల అజీర్ణం చేస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, అరటిపండ్లు, పాలు ఎప్పుడూ కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈ కలయిక మీ ఆరోగ్యానికి హానికరం. అరటిపండ్లు తిన్న తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలు కలిగిస్తాయి. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినకూడదు. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినడం వల్ల అజీర్ణం చేస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, అరటిపండ్లు, పాలు ఎప్పుడూ కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈ కలయిక మీ ఆరోగ్యానికి హానికరం. అరటిపండ్లు తిన్న తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలు కలిగిస్తాయి.

అరటిపండ్లు తిన్న తర్వాత తీపి పదార్థాలు కూడా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. అరటిపండ్లు తిన్న తర్వాత వాటిని తీసుకోవడం వల్ల శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. మధుమేహం లేకపోయినా అరటి పండు తర్వాత స్వీట్స్ తినకూడదని చెబుతున్నారు.

అంతేకాదు.. రాత్రిపూట కూడా అరటి పండును అస్సలు తినకూడదని నిపుణులు చెబుతుంటారు. బనానా తిన్న తర్వాత వేయించిన పదార్థాలు తినకూడదు. కారంతో చేసిన పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండాలి. కాఫీలు, టీలు బనానా తిన్నాక తాగడం మానేయాలి. దీని వల్ల జీర్ణసమస్యలు , అలెర్జీలు, ముఖంపై మచ్చలు వస్తాయి.

అలాగే అరటిపండు తిన్న తర్వాత కాఫీ తాగకూడదు. ఈ సమయంలో కాఫీ తాగడం వల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. అరటిపండు తిన్న వెంటనే చల్లటి నీరు తాగకూడదు. దీనివల్ల జీర్ణ ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడతాయి. రాత్రిపూట సాధ్యమైనంతవరకు అరటి పండును తినకపోవడమే మేలు.

బంగాళదుంప, అరటి పండును కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. బంగాళదుంపలో పిండిపదార్థం ఎక్కువగా ఉంటుంది. రెండింటినీ కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. అందుకే ఈ రెండింటి కాంబినేషన్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అలసత్వం వద్దు.. నిద్ర తగ్గితే వచ్చే 5 ప్రమాదకర సమస్యలు ఇవే



నిద్ర అనేది మనిషి ఆరోగ్యం, శ్రేయస్సులో అత్యంత ముఖ్యమైన భాగం. అవసరమైన గంటలు నిద్ర లేకపోవడం, మంచి నాణ్యత గల నిద్ర దొరకకపోవడం వల్ల ఆరోగ్యంపై అనేక విధాలుగా ప్రభావం పడుతుంది. ప్రతిరోజూ కనీసం 7-8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. అయితే, చాలామంది తమ నిద్ర సమయాన్ని ఇతర పనుల కోసం కేటాయించి విశ్రాంతి తీసుకోవడం లేదు ఇలా చేయడం వల్ల కేవలం నిద్ర ఆరోగ్యంపైనే కాదు, మొత్తం శరీరం, శ్రేయస్సుపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. బరువు పెరగడం నుంచి క్యాన్సర్, మధుమేహం, డిప్రెషన్ వంటి తీవ్రమైన వ్యాధుల ముప్పు పెరగడం వరకు, ఈ జాబితా అంతులేనిది. అందుకే, చక్కగా నిద్రపోవడం అత్యవసరం. మీరు నిద్ర గంటలను తగ్గించుకుంటే మీ శరీరానికి ఏమి జరుగుతుందో తెలుసుకోండి..

**1. బరువు పెరుగుట:** మీరు నిద్ర లేకపోతే, అది ఆకలిని నియంత్రించే హార్మోన్లైన 'ఘ్రెలిన్', 'ల్యాప్టిన్' సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల మీకు అధిక కేలరీలు, చక్కెర పదార్థాలపై కోరిక పెరిగి, ఎక్కువగా తినేలా చేస్తుంది. ఇది తక్కువ శక్తి, తక్కువ శారీరక శ్రమతో కలిసి బరువు పెరగడానికి దారితీస్తుంది.

**2. టైప్ 2 మధుమేహం ప్రమాదం:** మీరు నిద్రలేమితో బాధపడుతున్నప్పుడు, ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునే మీ శరీర సామర్థ్యం దెబ్బతింటుంది. దీనివల్ల 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' ఏర్పడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, కాలక్రమేణా టైప్ 2 మధుమేహానికి దారితీస్తుంది.

**3. గుండె జబ్బుల ప్రమాదం:** నిద్రలేమి గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది, 'కార్టిసాల్' వంటి ఒత్తిడి హార్మోన్లను పెంచుతుంది మరియు మంటను కలిగిస్తుంది. ఈ కారకాలన్నీ కలిసి గుండె జబ్బులు, స్ట్రోక్ మరియు ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి.

**4. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ:** నిద్రలో మీ శరీరం 'సైటోకైన్‌లను' విడుదల చేస్తుంది, ఇవి అంటువ్యాధులు మరియు మంటలతో పోరాడటానికి సహాయపడతాయి. అయితే, మీకు అవసరమైన నిద్ర లేకపోతే, సైటోకైన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. **5. క్యాన్సర్ ప్రమాదం:** తక్కువ నిద్ర దెబ్బతినడాన్ని సరిచేసే మరియు కణాల పెరుగుదలను నియంత్రించే శరీర సామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దీనితో పాటు, ఇది 'మెలటోనిన్' ఉత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది, ఇది రొమ్ము, ప్రోస్టేట్ మరియు కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్‌ల అభివృద్ధికి దారితీస్తుంది

# ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్.. అక్టోబర్ 21న జియో ఐపీఓ ఓపెన్..!

సంవత్సరాల నిరీక్షణ తర్వాత జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ను సెబీకి దాఖలు చేసింది. అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఓలలో ఒకదానికి మార్గం సుగమమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్, టెలికాం విభాగంగా, జియో భారతదేశ టెలికాం రంగ స్వరూపాన్ని మార్చివేసింది. బ్రాడ్‌బ్యాండ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ సేవలు, డిజిటల్ వినోదం మరియు ఏఐ రంగాలలో బలమైన ఉనికిని చాటుకుంది. ఐపీఓ ప్రక్రియ ఇప్పుడు కొనసాగుతున్నందున, పెట్టుబడిదారులు కంపెనీ వ్యాపారం, ఆర్థిక పనితీరు, కీలక బలాలు, నష్టభయాలు, ఈ పబ్లిక్ ఇష్యూ ఏమి అందించగలదో తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారు. రిలయన్స్ జియో ఐపీఓ అక్టోబర్ 21 నుంచి 23 తేదీల్లో సబ్?స్క్రిప్షన్ కోసం ఓపెన్ అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. జియో షేర్లు అక్టోబర్ 28న స్టాక్ మార్కెట్ లో లిస్ట్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెబీ నుంచి అవసరమైన అన్ని అనుమతులు రావడంతో ఏ క్షణమైన ఐపీఓ వివరాలు ప్రకటించే అవకాశం ఉంది. 2019లో స్థాపించిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ యొక్క డిజిటల్ సేవల విభాగం, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ హోల్డింగ్ కంపెనీ. టెలికాం సేవలతో పాటు, ఈ కంపెనీ బ్రాడ్‌బ్యాండ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్, డిజిటల్ వినోదం, ఏఐ ఆధారిత సేవల రంగాలలో కూడా సేవలు అందిస్తోంది. గ్రే మార్కెట్ లో ప్రీమియంలో ట్రేడవుతోన్న ఓరియంట్ కేబుల్స్ షేర్లు..! 2026, మార్చి 31 నాటికి, జియో 524 మిలియన్లకు పైగా చందాదారులకు సేవలు అందిస్తూ, భారతదేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా, ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ నెట్‌వర్క్‌లలో ఒకటిగా నిలిచింది. జియో ప్లాట్‌ఫామ్స్ 100% ఫ్రెష్ ఇష్యూను ప్రతిపాదించింది. అంటే ఐపీఓ ద్వారా ప్రస్తుత వాటాదారులెవరూ తమ వాటాను విక్రయించడం లేదు. ఈ ఐపీఓ ద్వారా వచ్చే నిధులను తమ బ్యాలెన్స్ షీట్‌ను బలోపేతం చేయడానికి, భవిష్యత్ వృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి ఉపయోగించాలని కంపెనీ యోచిస్తోంది. నివేదికలు ప్రకారం ఈ ఐపీఓ ద్వారా దాదాపు రూ.35,000-40,000 కోట్లు




సమీకరించే అవకాశం ఉంది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశం ఉంది. అయితే కంపెనీ ఇంకా తుది ఇష్యూ పరిమాణం, ధరల శ్రేణి లేదా సబ్‌స్క్రిప్షన్ తేదీలను ప్రకటించలేదు. ఈ ఐపీఓ ద్వారా సేకరించిన నిధులలో సుమారు రూ.27,500 కోట్లు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ అప్పుల చెల్లింపులకు ఉపయోగించనున్నారు. 50 శాతం షేర్లను రిటైల్, హెచ్ఎన్ఐ ఇన్వెస్టర్లకు కేటాయించారు. రిటైల్ విభాగానికి 35 శాతం రిజర్వ్ చేశారు. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టే రిటైల్ ఇన్వెస్టర్లు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది మార్చి నాటికి జియో సబ్‌స్క్రైబర్ల సంఖ్య 52.44 కోట్లకు చేరింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# లాటరీలో ఏకంగా రూ.13 కోట్లు గెలుచుకున్న వ్యక్తి..!

శనివారం జరిగిన తాజా యూఏఈ లాటరీ లక్కీ డే డ్రాలో 5 మిలియన్ దిర్హమ్‌ల ద్వితీయ బహుమతి విజేతను ప్రకటించారు. ఓ విజేతకు డ్రాలో 50 లక్షల దిర్హమ్స్ వచ్చాయి. అంటే ఇండియన్ కరెన్సీ ప్రకారం ఇది దాదాపు రూ.13 కోట్లు. లక్కీ డే డ్రా నెంబర్ 261003వ డ్రాలో ఇది రెండో బహుమతిగా నిర్వాహకులు తెలిపారు. అయితే గ్రాండ్ ప్రైజ్ అయిన 3 కోట్ల దిర్హమ్‌లను మాత్రం ఎవరూ గెలుచుకోలేకపోయారని తెలిపారు. తాజా డ్రాలో పాల్గొన్నవారిలో పలువురు వివిధ కేటగిరీల్లో నగదు బహుమతులను సొంతం చేసుకున్నట్లు పేర్కొంది. లక్కీ డే డ్రా నెం. 261003 నంబర్ లో రోజుల విభాగంలో 12, 17, 4, 5, 18, 14 విజేత సంఖ్యలుగా నిలవగా.. నెలల విభాగంలో 10 మంది విజేతలుగా నిలిచారు. గ్యారెంటీడ్ లక్కీ ఛాన్స్ ఐడీ బహుమతి విభాగంలో ముగ్గురు పార్టిసిపెంట్లు ఒక్కొక్కరు 50,000 దిర్హమ్‌లను కైవసం చేసుకున్నారు. విజేత లక్కీ ఛాన్స్ ఐడీలు 7185090,0396336, 4042367.మొత్తం ఆరు డేస్ నంబర్లను సరిగ్గా సరిపోల్చిన ఒక విజేత 50 లక్షల దిర్హమ్‌ల రెండో బహుమతిని సాధించాడు. 30 మిలియన్ దిర్హమ్‌ల గ్రాండ్ ప్రైజ్‌ను గెలుచుకోవడానికి అవసరమైన అన్ని సంఖ్యలను ఏ పార్టిసిపెంట్ కూడా సరిపోల్చలేదు. రూ. 4.39 లక్షల నుంచి రూ. 2.25 లక్షలకు పడిపోయిన వెండి ధర.. కొనుగోలుపై నిపుణులు కీలక సూచన.. ఇదిలా ఉండగా మరో విభాగంలో ఒక ప్లేయర్ 5 మిలియన్ దిర్హమ్‌ల ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. అదనంగా ఒక పార్టిసిపెంట్ 100,000 దిర్హమ్‌ల లక్కీ డే తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. గెలుపొందిన నెల సంఖ్యతో పాటు, రోజుల విభాగంలోని ఐదు సంఖ్యలను సరిపోల్చిన పాల్గొనేవారికి బహుమతి అందజేస్తారు. 7,966 మంది తలా 100 దిర్హమ్‌లు గెలుచుకున్నారు. తాజా డ్రాలో అన్ని కేటగిరీలను కలిపి మొత్తం 8,025 మంది బహుమతులు పొందారు. “ఈ రాత్రి డ్రాలో గెలిచిన మన లక్కీ డే విజేతలందరికీ అభినందనలు! ఉత్సాహం ఇక్కడితో ముగియదు” అని షో హోస్ట్




చాదీ ఖలాఫ్ అన్నారు. లక్కీ డే డ్రా వారానికి రెండుసార్లు జరుగుతుంది యూఏఈ తదుపరి లాటరీ లక్కీ డే డ్రా అక్టోబర్ 7, బుధవారం నాడు నిర్వహించనున్నారు. పాల్గొనేవారు మరోసారి ఐష్ట్ర30 మిలియన్ల జాక్‌పాట్‌తో పాటు, అనేక ఇతర నగదు బహుమతులను గెలుచుకునే అవకాశం ఉంటుంది. 50 లక్షల దిర్హమ్స్ గెలిచిన వ్యక్తి విషయాలు బయటకు రాలేదు. ఆ వ్యక్తి ఇండియాకు చెందిన వాడా కాదా అని తెలియరాలేదు. అయితే గతంలో కూడా కొంత మంది ఇండియన్స్ లాటరీలో భారీగా డబ్బును గెలుచుకున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# వచ్చేవారం ఐటీ స్టాక్స్‌లో బిగ్ ర్యాలీ.. టెక్ షేర్లకు ఊపిరిపోసిన యాక్సెంచర్ ఫలితాలు..

రాకతో మానవశక్తి, సమయం తగ్గిపోయి ఐటీ కంపెనీల పనిభారం ఆదాయాలు కుంచించుకుపోతాయేమోనని గత కొంతకాలంగా పెట్టుబడిదారులలో ఉన్న తీవ్ర ఆందోళనలకు చెక్ పడింది. ఐటీ దిగ్గజం ‘యాక్సెంచర్’ వెల్లడించిన బలమైన ఆర్థిక ఫలితాలు, భవిష్యత్ అంచనాలు మార్కెట్ భయాలను ఒక్కసారిగా పటాపంచలు చేశాయి. ఏఐ కేవలం పనిని సులభతరం చేయడమే కాకుండా, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టిస్తుందని నిరూపితమవ్వడంతో యాక్సెంచర్ స్టాక్ గణనీయంగా దూసుకెళ్ళింది. ఈ జోష్‌తో కాగ్నిజెంట్, ఈపీఏఎం, గ్లోబంట్ కంపెనీల షేర్లు కూడా పుంజుకున్నాయి. అమెరికా మార్కెట్లలో భారతీయ ఐటీ కంపెనీల అమెరికన్ డిపాజిటరీ రిసిప్ట్స్ కూడా మెరుగైన ప్రదర్శన కనబరచడంతో ఇన్ఫోసిస్ ఏడీఆర్, విప్రో ఏడీఆర్‌లు లాభపడ్డాయి. గాంధీ జయంతి, వారాంతపు సెలవుల అనంతరం సోమవారం నాడు దేశీయ మార్కెట్లు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో భారతీయ ఐటీ స్టాక్‌లపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకృతమైంది. ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగినప్పటికీ కంపెనీలకు వ్యాపారం ఎలా పెరుగుతుందనే దానికి యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్ ఆసక్తికర వివరణ ఇచ్చారు. ఆర్థికశాస్త్రంలో ప్రసిద్ధి చెందిన ‘జెవాన్స్ పారడాక్స్’ సూత్రాన్ని ఆమె ఉటంకించారు. సామర్థ్యం పెరిగి ఖర్చు తగ్గితే, దాని వినియోగం మరియు డిమాండ్ పెరుగుతాయని ఈ సూత్రం చెబుతోంది. గతంలో అధిక సాంకేతిక వ్యయం కారణంగా ఒక కంపెనీ రెండు ప్రాజెక్టులను మాత్రమే చేపడితే, ఇప్పుడు ఏఐ వల్ల వ్యయం, సమయం తగ్గడంతో అదే బడ్జెట్‌లో ఐదు ప్రాజెక్టులను ప్రారంభించగలదు. ఒక ప్రాజెక్ట్‌కు పట్టే శ్రమ తగ్గినా, మొత్తం ప్రాజెక్ట్‌ల సంఖ్య పెరగడం వల్ల ఐటీ కంపెనీలకు మొత్తం




పనిభారం మరియు కొత్త అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. 15 ఏళ్ల అనుభవం ముందు గాలిలో కలిసిపోయింది.. రేపు మీ వంతు.. యూకేలో ఉద్యోగం పోయిన భారత టెకీ కీలక హెచ్చరిక.. యాక్సెంచర్ నివేదికలోని గణాంకాలు మార్కెట్లలో విశ్వాసాన్ని పెంచాయి. స్థిర కరెన్సీ ప్రాతిపదికన యాక్సెంచర్ 4 ఆదాయం 7% వృద్ధి చెందగా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను వృద్ధి 5%గా నమోదైంది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి 3-6% ఆదాయ వృద్ధిని కంపెనీ అంచనా వేయడం మార్కెట్‌కు పెద్ద ఊరటనిచ్చింది. అంతేకాకుండా, కంపెనీ రికార్డు స్థాయిలో 100 మిలియన్లు లేదా అంతకంటే ఎక్కువ విలువైన 141 డెసిషన్ బుకింగ్‌లను నమోదు చేయగా, మొత్తం కొత్త బుకింగ్‌లు 22.4 బిలియన్లకు చేరాయి. వందలాది మంది క్లయింట్లు అధునాతన ఏఐ ప్రాజెక్ట్‌లను ప్రారంభించడం మరియు ఏఐ వినియోగం వల్ల ప్రతి ఉద్యోగి ద్వారా వచ్చే సగటు ఆదాయం పెరగడం దీనిలోని ప్రతికూల అపోహలను తొలగించింది. ఇన్ఫోసిస్, విప్రో ఏడీఆర్‌లలో కనిపించిన లాభాలు సోమవారం నాటి దేశీయ మార్కెట్లకు సానుకూల సంకేతాన్ని ఇస్తున్నాయి. ఇన్ఫోసిస్, విప్రోలతో పాటు టీసీఎస్ హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ ఐటీ స్టాక్‌లలో కూడా సెంటిమెంట్ మెరుగుపడే అవకాశం ఉంది. అయినప్పటికీ, యాక్సెంచర్ ఫలితాలు రంగానికి సానుకూల వాతావరణాన్ని తెచ్చినప్పటికీ, భారతీయ కంపెనీలన్నింటికీ ఇదే తరహా ఆదాయ వృద్ధి వెంటనే సాధ్యపడకపోవచ్చు. సోమవారం మార్కెట్ ప్రారంభ సమయానికి ఉండే అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరలు మరియు స్థానిక కారకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఏది ఏమైనప్పటికీ, ఏఐ వల్ల ఐటీ రంగానికి ముప్పు ఉందనే భయాల నుండి ఉపశమనం లభించడం ప్రస్తుతం మార్కెట్‌కు లభించిన అతిపెద్ద సానుకూల అంశం. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇ వ్వడం కాని, అను మతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సె క్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కో సమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసు కునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# ఆపిల్ పే ఇండియాలో లాంచ్ అయినా పెద్ద బ్యాంకులు ఎందుకు చేరలేదు.. అసలు కారణం ఇదే..

ప్రపంచ టెక్ దిగ్గజం ఆపిల్ తన ప్రసిద్ధ చెల్లింపుల సేవ ‘ఆపిల్ పే’ను ఎట్టకేలకు భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. సెప్టెంబర్ 30న యాక్సిస్ బ్యాంక్ జారీ చేసిన వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్ కార్డుల ద్వారా ఈ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన ఈ డిజిటల్ వాలెట్.. భారతదేశంలో అడుగుపెట్టిన మొదటి రోజే అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా దేశంలోనే అతిపెద్ద క్రెడిట్ కార్డ్ జారీదారులైన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎస్‌బిఐ కార్డ్, ఐసిఐసిఐ బ్యాంకులు ఈ ప్రారంభ విడుదల భాగస్వామ్యంలో చేరకపోవడం ఆర్థిక రంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. సాంకేతిక సంసిద్ధతను కారణంగా చూపిస్తున్నప్పటికీ.. దీని వెనుక అసలు కారణం ఆదాయ వాటా పంపిణీపై జరిగిన చర్చలు విఫలం కావడమేనని స్పష్టమవుతోంది. ఆపిల్ పే ద్వారా జరిగే ప్రతి లావాదేవీ విలువపై ఆపిల్ సంస్థ దాదాపు 0.20 శాతం అంటే 20 బేసిస్ పాయింట్ల కమీషన్‌ను కోరింది. కానీ దేశంలోని పెద్ద బ్యాంకులు గరిష్టంగా 15 బేసిస్ పాయింట్లు మాత్రమే ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశాయి. ఆపిల్ వాలెట్ వినియోగం ద్వారా కార్డుల వాడకం పెరిగి, బ్యాంకులు మర్చంట్ డిస్కౌంట్ రేట్, ఇంటర్‌ఛేంజ్ రుసుముల రూపంలో అధిక




ఆదాయాన్ని పొందుతాయని ఆపిల్ ప్రతిపాదిస్తున్నప్పటికీ.. భారతీయ బ్యాంకులు మాత్రం దీనితో ఏకీభవించడం లేదు. ఆపిల్ పే ప్రమేయం లేకుండానే జరిగిపోయే సాధారణ లావాదేవీల కోసం ఆపిల్‌కు అధిక కమీషన్ చెల్లించడం తమ లాభదాయకతను దెబ్బతీస్తుందని బ్యాంకులు భావిస్తున్నాయి. ఓటీపీ, పిన్ లేకుండా స్మార్ట్ వాచ్‌తో పేమెంట్.. అందుబాటులోకి యాపిల్ పే..! భారతీయ క్రెడిట్ కార్డ్ కస్టమర్ల ప్రవర్తన పాశ్చాత్య దేశాల వినియోగదారులతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ కస్టమర్లు కేవలం డిజిటల్ సౌలభ్యం కంటే క్యాష్‌బ్యాక్‌లు, రివార్డ్ పాయింట్లు, పండుగ సమయాల్లో వచ్చే బ్యాంక్ ఆఫర్లకే అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఉదాహరణకు ఒక వినియోగదారుడు ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఆపిల్ వాలెట్‌లో దాచిన కార్డ్ కంటే.. సదరు ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌పై అత్యధిక తగ్గింపును అందించే బ్యాంక్ కార్డునే ఎంచుకుంటారు. ఈ పరిస్థితిలో ఆపిల్ పే ప్రత్యేకంగా ఒక బ్యాంక్ కార్డ్ వాడకాన్ని ఆటోమేటిక్‌గా పెంచుతుందనే వాదన బలంగా నిలవడం లేదు. అదనంగా, భారతదేశంలో ఇప్పటికే గూగుల్ పే, ఫోన్‌పే వంటి ప్రముఖ యాప్‌ల ద్వారా క్రెడిట్ కార్డులను అనుసంధానించి ట్యాప్-అండ్-పే లావాదేవీలు ఉచితంగా చేసుకునే వెసులుబాటు ఉంది. మరోవైపు దేశీయంగా క్రెడిట్ కార్డ్ వ్యాపార ఆర్థిక సూత్రాలు కూడా వేగంగా మారుతున్నాయి. గతంలో కార్డ్ వినియోగదారులు నెలవారీ బిల్లును వాయిదాలలో చెల్లిస్తూ అధిక వడ్డీలు చెల్లించేవారు. దానివల్ల బ్యాంకులకు భారీ లాభాలు వచ్చేవి. కానీ, వినియోగదారుల్లో అవగాహన పెరగడం, తక్కువ వడ్డీకే వ్యక్తిగత రుణాలు లభిస్తుండటంతో, మెజారిటీ కస్టమర్లు బిల్లింగ్ సైకిల్ పూర్తయ్యేలోపే పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు.

# ధోనీ చెప్పిన ఆ ఒక్క మాట.. భారత్‌పై మా గెలుపునకు కారణమైంది: విండీస్ కెప్టెన్ హోప్

**భారత్‌పై చరిత్రాత్మక ఛేదనతో గెలిచిన వెస్టిండీస్ అజేయ సెంచరీతో జట్టును గెలిపించిన కెప్టెన్**

**హోప్ తన విజయానికి ధోనీ ఇచ్చిన సలహాయే కారణమని వెల్లడి**



నీకనుకున్న దానికంటే ఎక్కువ సమయం ఉంటుందన్న ధోనీ మాటలను గుర్తు చేసుకున్న హోప్ మొహాలీలోని ముల్లన్‌పూర్‌లో నిన్న జరిగిన మూడో వన్డేలో టీమిండియాపై వెస్టిండీస్ చారిత్రక విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 352 పరుగుల భారీ లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఛేదించి, వన్డే క్రికెట్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. ఈ అద్భుత విజయంలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (162 నాటౌట్) కీలక పాత్ర పోషించాడు. అయితే, ఇంతటి భారీ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు తనను ప్రశాంతంగా నిలబెట్టింది భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఇచ్చిన ఒక సలహా అని మ్యాచ్ అనంతరం హోప్ వెల్లడించడం విశేషం.ఈ మ్యాచ్‌లో 50 ఓవర్ల పాటు వికెట్ కీపింగ్ చేసి, ఆ తర్వాత ఇన్నింగ్స్ ఓపెనర్‌గా బరిలోకి దిగిన షాయ్ హోప్.. ఆరంభం నుంచి చివరి వరకు అద్భుతమైన సంయమనంతో ఆడాడు. 143 బంతుల్లో అజేయంగా 162 పరుగులు చేసి జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. మ్యాచ్ మధ్యలో కండరాలు పట్టేసినా, ఏమాత్రం పట్టువిడవకుండా పోరాడాడు.విజయం అనంతరం షాయ్ హోప్ మాట్లాడుతూ.. “భారీ లక్ష్య ఛేదనలో ఉన్నప్పుడు నాకు గొప్ప ఆటగాడైన ఎంఎస్ ధోనీ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ‘నువ్వు అనుకున్నదానికంటే నీకు ఎప్పుడూ ఎక్కువ సమయం ఉంటుంది’ అని ఆయన ఒకసారి నాతో అన్నారు. ఆ మాటలే నాకు ఓపికగా ఉండేలా చేశాయి. లక్ష్యాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించుకుని ఆడాను” అని తెలిపాడు.“ఓవర్ రేట్ కారణంగా భారత జట్టు చివరి ఓవర్లలో ఫీల్డర్లను సర్కిల్ లోపలికి తీసుకురావాల్సి వస్తుందని నాకు తెలుసు. అందుకే ప్రశాంతంగా వేచి చూశాను. భారత్‌లో మంచు ప్రభావం ఉండటంతో ఛేదన సులభమైంది. సిరీస్‌ను గెలుపుతో ముగించడం చాలా ఆనందంగా ఉంది. మా బ్యాటర్లు నిలకడగా రాణించారు, బౌలింగ్‌లో మరింత మెరుగుపడాల్సి ఉంది” అని హోప్ వివరించాడు. కాలికి గాయమైనప్పటికీ, రెండు రోజుల్లో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు అందుబాటులో ఉంటానని హోప్ ధీమా వ్యక్తం చేశాడు.

# హోప్ అద్భుత అజేయ శతకం.. మూడో వన్డేలో భారత్‌కు వెస్టిండీస్ షాక్!

**మూడో వన్డేలో భారత్‌పై 5 వికెట్ల తేడాతో నెగ్గిన వెస్టిండీస్**

**162 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించిన కెప్టెన్ షాయ్ హోప్**

**352 పరుగుల భారీ లక్ష్యాన్ని 48.2 ఓవర్లలోనే ఛేదించిన కరేబియన్ జట్టు**

**కేఎల్ రాహుల్ అజేయ శతకం వృథా**

**మూడు మ్యాచ్‌ల సిరీస్ 2-1 తేడాతో టీమిండియా కైవసం**



వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (162 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగడంతో మూడో వన్డేలో భారత్‌పై ఆ జట్టు 5 వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. 352 పరుగుల భారీ లక్ష్యాన్ని కరేబియన్ జట్టు మరో 10 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ ఓటమితో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలన్న టీమిండియా ఆశలకు గండిపడింది. అయితే, తొలి రెండు మ్యాచ్‌లలో గెలిచిన భారత్, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది.న్యూ చండీగఢ్‌లో నిన్న జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగుల భారీ స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ కేవలం 87 బంతుల్లోనే 129 పరుగులు చేసి అజేయంగా నిలవగా, రోహిత్ శర్మ (92) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. వీరిద్దరి మెరుపులతో భారత్ భారీ స్కోరు సాధించింది. విండీస్ బౌలర్లలో జేడెన్ సీల్స్ మూడు వికెట్లు పడగొట్టాడు.అనంతరం 352 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు కెప్టెన్ షాయ్ హోప్ ఆరంభం నుంచి చివరి వరకు క్రీజులో నిలిచి చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన హోప్, 143 బంతుల్లో 162 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అమీర్ జంగూ (67)తో కలిసి రెండో వికెట్‌కు 109 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, కీమో పాల్‌లతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపాడు. చివరిలో గుడకేశ్ మోటీ (19 నాటౌట్) వేగంగా ఆడటంతో విండీస్ 48.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలో వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక విజయవంతమైన ఛేదన కావడం విశేషం.2023 తర్వాత భారత్‌పై వన్డేల్లో వెస్టిండీస్‌కు ఇదే తొలి విజయం. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన షాయ్ హోప్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించగా, సిరీస్‌లో నిలకడగా రాణించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ గెలుచుకున్నాడు.

# కోల్‌కతాలో బ్రెజిల్ ఫుట్‌బాల్ విన్యాసాలు.. భారత్‌పై ఈజీ విక్టరీ

**స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత్‌పై బ్రెజిల్ ఘన విజయం**

**4-0 గోల్స్ తేడాతో భారత్ ను చిత్తు చేసిన సాంబా జట్టు**

**బ్రెజిల్ తరఫున శామ్యూల్ లినో రెండు గోల్స్‌తో మెరుపులు**

**ఆట అంతటా స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన బ్రెజిల్**

**కోల్‌కతాలోని వివేకానంద యువభారతి క్రీడాంగణం వేదికగా చరిత్రాత్మక మ్యాచ్**



భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన స్నేహపూర్వక మ్యాచ్‌లో టీమిండియాకు నిరాశే ఎదురైంది. శనివారం కోల్‌కతాలోని వివేకానంద యువభారతి క్రీడాంగణం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పటిష్ఠమైన బ్రెజిల్ జట్టు 4-0 గోల్స్ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఆట ప్రారంభం నుంచి చివరి వరకు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన బ్రెజిల్, తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో ఆకట్టుకుంది. భారత జట్టు గట్టిపోటీ ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ, బ్రెజిల్ అటాకింగ్, డిఫెన్స్ విభాగాల ముందు నిలవలేకపోయింది. నేమార్ వంటి అగ్రశేణి ఆటగాళ్లు లేకపోయినా, బ్రెజిల్ దూకుడు ముందు భారత్ నిలవలేకపోయింది.మ్యాచ్ ఆరంభం నుంచే బ్రెజిల్ దూకుడుగా ఆడింది. బంతిని తమ నియంత్రణలోనే ఉంచుకుంటూ భారత గోల్ పోస్ట్‌పై పదేపదే దాడులు చేసింది. ఈ క్రమంలో 28వ నిమిషంలో మాథ్యూజిన్హో అందించిన పాస్‌ను సద్వినియోగం చేసుకున్న ఎస్టెవావో అద్భుతమైన గోల్ చేసి బ్రెజిల్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం, తొలి అర్ధభాగం ముగియడానికి కొద్ది నిమిషాల ముందు (42వ నిమిషం) ఎస్టెవావో సహకారంతో పెడ్రో మరో గోల్ సాధించాడు. దీంతో విరామ సమయానికి బ్రెజిల్ 2-0 ఆధిక్యంలో నిలిచింది.రెండో అర్ధభాగంలోనూ బ్రెజిల్ అదే జోరును కొనసాగించింది. భారత జట్టు పుంజుకోవడానికి ప్రయత్నించినా, వారి వ్యూహాలు ఫలించలేదు. 58వ నిమిషంలో పెడ్రో అందించిన అసిస్ట్‌తో శామ్యూల్ లినో తన తొలి గోల్ చేసి, బ్రెజిల్ ఆధిక్యాన్ని 3-0కి పెంచాడు. ఆ తర్వాత కూడా భారత జట్టుపై ఒత్తిడి తగ్గించని బ్రెజిల్, అదనపు సమయంలో (90'o5) మరోసారి సత్తా చాటింది. మౌరో జూనియర్ పాస్‌తో శామ్యూల్ లినో తన రెండో గోల్ కొట్టి బ్రెజిల్ విజయాన్ని ఖరారు చేశాడు.గణాంకాలు పరిశీలిస్తే, మ్యాచ్‌లో బ్రెజిల్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. బ్రెజిల్ జట్టు బంతిని 66 శాతం తన అదుపులో ఉంచుకోగా, భారత్ 34 శాతంతో సరిపెట్టుకుంది. బ్రెజిల్ ఆటగాళు గోల్ పోస్ట్ దిశగా మొత్తం 20 కిక్ లు కొట్టగా, వాటిలో 7 లక్ష్యం వైపు దూసుకెళ్లాయి. మరోవైపు, భారత జట్టు 9 షాట్లు కొట్టినా, కేవలం 3 మాత్రమే టార్గెట్‌పైకి వెళ్లాయి. పాస్‌ల విషయంలోనూ బ్రెజిల్ (652) భారత్ (330) కంటే రెట్టింపు సంఖ్యలో పాస్‌లు పూర్తి చేసింది. భారత గోల్ కీపర్ 3 కీలక సేవ్‌లు చేసి మరిన్ని గోల్స్ కాకుండా కాపాడాడు. ప్రపంచ స్థాయి జట్టుతో ఆడిన ఈ మ్యాచ్, భారత జట్టుకు ఓటమి మిగిల్చినప్పటికీ విలువైన అనుభవాన్ని ఇచ్చిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ఎన్టీఆర్ 'డ్రాగన్'లో షాహిద్ కపూర్, ఆలియా భట్?

ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న హై–వోల్టేజ్ యాక్షన్ ప్రాజెక్ట్ 'డ్రాగన్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, ప్రముఖ నటి ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించిన వార్తలు అటు బీ టౌన్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇందులో షాహిద్ కపూర్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనుండగా, ఆలియా భట్ కీలకమైన పాత్రలో ఎన్టీఆర్ సరసన నటించనున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతున్న ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో మరియు టాలీవుడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ ప్రాజెక్ట్‌ను ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్, యువ సుధా ఆర్ట్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# ప్రశాంత్ నీల్ మూవీకి సెన్సార్ కష్టాలు.. రివైజింగ్ కమిటీని ఆశ్రయించిన '418' టీమ్!




అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన హారర్ సినిమా '418' సెన్సార్ బోర్డు అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఈ సినిమాలో హారర్ సీన్లు ఎక్కువగా ఉన్నాయంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అభ్యంతరం తెలపడంతో, మేకర్స్ రివైజింగ్ కమిటీని ఆశ్రయించారు. కిర్తన్ నాడగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 31నే విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడింది. అయితే సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారు.వీశీజఱవం ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కిర్తన్ నాడగౌడ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నాడు. అయితే ఒక హారర్ చిత్రంలో హారర్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఉన్నాయని సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలపడం పట్ల నెటిజన్లు సోషల్ మీడియాలో సంధిస్తున్నారు. 'హారర్ సినిమాలో హారర్ సీన్లు కాక ఇంకేముంటాయి?' అంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు.

# టాలీవుడ్‌లో 'లాలో' రీమేక్.. శ్రీకృష్ణుడిగా విజయ్ దేవరకొండ?



గుజరాతీలో సంచలన విజయం సాధించి బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన 'లాలో -- కృష్ణ సదా సహాయతే' సినిమా తెలుగు రీమేక్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. అంకిత్ సకియా దర్శకత్వంలో రూపొందిన ఈ డివోషనల్–డ్రామా చిత్రం గుజరాతీలో రూ. 100 కోట్లకు పైగా వసూలు చేయగా, ఈ సినిమా తెలుగు రీమేక్ హక్కులను ప్రముఖ నిర్మాత దిల్ రాజు దక్కించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ చిత్రంలో కీలకమైన శ్రీకృష్ణుడి పాత్రలో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తారంటూ జోరుగా ప్రచారం జరగగా, తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఆ స్థానంలో రౌడీ హీరో విజయ్ దేవరకొండ కనిపించనున్నాడని ప్రచారం ఊపందుకుంది. 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ఇప్పటికే అలరించిన విజయ్ దేవరకొండ, ఇప్పుడు శ్రీకృష్ణుడి పాత్రలో నటించనున్నాడనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. సాధారణ ఆటో డ్రైవర్ జీవితంలో జరిగే ఊహించని పరిణామాలు, ఆధ్యాత్మిక అనుభవాలు, శ్రీకృష్ణుడి నేతృత్వంలో సాగే ఆత్మశోధన ఈ చిత్ర ప్రధానాంశం కావడంతో తెలుగు ప్రేక్షకుల భావోద్వేగాలను హత్తుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణంలో, విజయ్ దేవరకొండ లాంటి యూత్ ఫాలోయింగ్ ఉన్న హీరో ఈ శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారనే ప్రచారంపై మేకర్స్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# చదువు మధ్యలో ఆపినందుకు ఇప్పటికీ బాధగా ఉంది - కరీనా కపూర్



బాలీవుడ్ ప్రముఖ నటి కరీనా కపూర్ తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేయలేకపోయాననే లోటు తనలో ఇప్పటికీ ఉండిపోయిందని అన్నారు. సినిమాలపై ఉన్న మక్కువతో చదువును మధ్యలోనే ఆపేయడం పట్ల ఆమె తాజాగా విచారం వ్యక్తం చేశారు. కేవలం 19 ఏళ్ల వయసులో, 2000 సంవత్సరంలో అభిషేక్ బచ్చన్ సరసన 'రెఫ్యూజీ' సినిమాతో నటిగా తెరంగేట్రం చేసిన ఆమె.. ఆ తర్వాత పూర్తిగా సినిమాలపైనే దృష్టి పెట్టడంతో పదకొండవ తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవం దృష్ట్యా, తన కుమారులు ముందుగా చదువును పూర్తిగా ముగించుకున్న తర్వాతే తమకు ఇష్టమైన రంగాల వైపు అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇక భారతదేశంలో బాలికల విద్యను ప్రోత్సహించేందుకు యూనిసెఫ్ తనను సంప్రదించినప్పుడు, తన విద్యాభ్యాసం అసంపూర్తిగా మిగిలిపోయిందనే వెలితి కారణంగానే తాను ఆ ఉద్యమంతో మానసికంగా మరింతగా కనెక్ట్ అయ్యానని తెలిపారు. హిందీ చిత్ర పరిశ్రమలో అగ్రనటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కరీనా, ప్రస్తుతం మేఘనా గుల్జార్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్‌తో కలిసి నటిస్తున్న డైరా (ఞఖుఎతీఖ) చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.



# 'వీర ధీర సూరన్' దర్శకుడితో కమల్ హాసన్ కొత్త మూవీ!

కోలీవుడ్‌లో ఓ సరికొత్త క్రేజీ కాంబినేషన్ సెట్స్ పైకి రానుంది. 'చిత్తా', 'వీర ధీర సూరన్' వంటి విభిన్న చిత్రాలతో టాలెంటెడ్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్న ఎస్.యు. అరుణ్ కుమార్ తాజాగా విశ్వనటుడు ఉలగనాయగన్ కమల్ హాసన్‌తో సినిమా చేయబోతున్నాడు. కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్  బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతోంది. సహజమైన భావోద్వేగాలు, సరికొత్త కథాంశాలతో ప్రేక్షకులను మెప్పించడంలో ప్రత్యేక శైలి కలిగిన ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో కమల్ హాసన్ నటిస్తుండటంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన టెస్ట్ షూట్ స్టిల్స్ సోషల్ మీడియాలో లీకై నెట్టింట తెగ వైరల్ కాగా, తాజాగా మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో కమల్ హాసన్ మునుపెన్నడూ చూడని సరికొత్త మాస్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. సాధారణ రొటీన్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, బలమైన కంటెంట్ మరియు రియలిస్టిక్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ ప్రాజెక్ట్ ఉండబోతున్నట్లు సమాచారం. చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటులు అలాగే సాంకేతిక నిపుణుల జాబితాను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040